# జనశక్తి

విప్లవ కమ్యూనిస్టుల పక్ష పత్రిక

www.janashaktionline.com

సంపుటి : 44 సంచిక : 19 విజయవాడ 5-2-2012 పేజీలు : 8 వెల: రు 5.00


లోపలి పేజీల్లో...


◈ సిరియా : 'ప్రభుత్వ మార్పిడి' నాటక ప్రదర్శన

◈ ప్రపంచవ్యాపిత కార్మిక ఆందోళనలు

◈ ఉత్తరప్రదేశ్ ఎన్నికలు : సిపిఐ (ఎం-ఎల్) పిలుపు

◈ మారుతి సుజికి కార్మికుల ఉద్యమం : సమీక్ష


## యానాం రీజన్సీ కంపెనీ యాజమాన్య కుటిల నిరంకుశ విధానాలు-పోలీసు కాల్పులు- కార్మికుల ధర్మాగ్రహం

కేంద్రపాలిత ప్రాంతమైన యానాంలోని రీజన్సీ కంపెనీలో కార్మికులు తమ హక్కులకోసం, కనీస వేతనాల కోసం, చట్టబద్ధంగా యూనియన్ ఏర్పాటు చేసుకోవటంకోసం, తమ సమస్యల పరిష్కారం కోసం నిలబడి ప్రశ్నించటాన్ని, నిలదీయటాన్ని ఉద్యమించటాన్ని సహించలేని రీజన్సీ కంపెనీ యాజమాన్యం, పోలీసు అధికారులను ఉసిగొల్పి కార్మిక నాయకుడు మచ్చా సోమేశ్వర మురళీమోహన్‌ను క్రూరంగా, ఘోరంగా హత్యగావించింది. అనేకమందిని తీవ్రంగా గాయపరిచింది. మృతిచెందిన కామ్రేడ్ మురళీ మోహన్‌కు 'జనశక్తి' జోహార్లర్పిస్తున్నది. గాయపడిన వారందరికి సానుభూతిని తెలియజేస్తున్నది. రీజన్సీ కంపెనీ కార్మికుల ఉద్యమానికి సంఘీభావాన్ని ప్రకటిస్తున్నది.

జనవరి 27న జరిగిన ఈ ఘటనకు ముందు, తదనంతర పరిణామాలను పరిశీలిస్తే కార్మిక యూనియన్ నాయకుడు మచ్చా మురళీమోహన్‌ను లొంగదీసుకోవడానికీ, లొంగిరాకపోతే భౌతికంగా అంతం చేయడానికీ యాజమాన్యం పథకం పన్ని, తదనుగుణంగా క్రూరంగా వ్యవహరించిందని స్పష్టమౌతున్నది. రీజన్సీ కంపెనీ యాజమాన్యమే మురళీమోహన్ హత్యలో మొదటి ముద్దాయనేది నిర్వివాదం.

రీజన్సీ యాజమాన్యం, కేంద్రపాలిత ప్రాంతమైన యానాంలో పరిశ్రమ స్థాపించి తద్వారా లభించే అన్ని రకాలైన రాయితీలతో లబ్ధి పొందింది, పొందుతున్నది. గత 28 సంవత్సరాలుగా కార్మికుల ప్రాథమిక హక్కులన్నింటినీ హరించివేస్తూ కనీస వేతనాలు కూడా చెల్లించకుండా వారి శ్రమశక్తిని కారు చౌకగా కొల్లగొట్టటం ద్వారా లాభాల రూపంలో వేలకోట్లరూపాయల విలువైన సంపదలను పోగేసుకుంది. తన యూనిట్లను ఇతర ప్రాంతాలకు విస్తరించింది. (కార్మికుడు విధులలో చేరినపుడు చెల్లించే వేతనం రు. 2800 నుంచి సీనియర్ ఆపరేటర్లకు ఇచ్చే రు. 7000 లోపు వేతనాలే, ఈనాటికీ కంపెనీ చెల్లించే గరిష్ట వేతనాలుగా వున్నాయి)

అత్యంత నికృష్టంగా సాగించే తమ దోపిడీ తేటతెల్లం గాకుండా వుండేందుకు, ఆదినుండీ కంపెనీ యాజమాన్యం పరమ నిరంకుశంగా వ్యవహరిస్తూ వస్తున్నది. 16 సంవత్సరాల క్రితం కార్మికులు యూనియన్ పెట్టుకునే ప్రయత్నం చేస్తేనే నాయకులను ఉద్యోగాలనుండి శాశ్వతంగా తొలగించింది. కార్మికులను బెదిరింపులకు గురిచేసింది. అయినప్పటికీ కార్మికులు అనివార్యంగా పోరాటబాటనే చేపట్టారు. పెరుగుతున్న ధరలతో జీవనం సాగించటం దుర్భరంగా వుందని, ఇదే కంపెనీ యాజమాన్యంలోని ఇతర యూనిట్లలో చెల్లిస్తున్నపాటి వేతనాలు, బోనస్‌లనైనా తమకు కనీసం చెల్లించాలని కార్మికులు డిమాండ్ చేశారు. 'ఆఫీసర్స్ అండ్ వర్కర్స్ యూనియన్' ఏర్పరచుకొని శాంతియుతంగా వివిధ రూపాల్లో ఆందోళన కార్యక్రమాలు సాగిస్తూవస్తున్నారు. యూనియన్‌ల ఉనికినే సహించలేని కంపెనీ యాజమాన్యం-ఆఫీసర్లు, కార్మికులు ఒకే యూనియన్‌గా వుండకూడదనే కుటిలవాదనతో కోర్టుకు వెళ్ళి తమకనుకూలంగా తీర్పును రాబట్టుకొని చట్టబద్ధంగా యూనియన్ నమోదు కాకుండా అడ్డుకుంది. యూనియన్‌ను తుడిచిపెట్టడం కోసం పూనుకుంది. మొన్నటి కాల్పులకు రెండునెలల ముందునుండీ కార్మికులకు జీతాలు ఇవ్వకుండా వేధింపులు సాగించింది. కార్మికుల ఇళ్ళకు కరెంటు బిల్లులు చెల్లించలేదు. వారి ఇళ్ళకు నీటి సరఫరాను నిలిపివేసింది. యూనియన్ కార్యకలాపాలను నిరోధించేందుకు కంపెనీ యాజమాన్యం తన ఆర్థిక, రాజకీయ దన్నును, సాంఘిక పలుకుబడులనుపయోగించి పోలీసు, కార్మిక, రెవిన్యూ తదితర ప్రభుత్వ ఉన్నతాధికార యంత్రాంగాన్నంతా కార్మికులకు వ్యతిరేకంగా మోహరించింది. యూనియన్ నాయకుడు మచ్చా మురళీమోహన్‌ను, మరో ఎనిమిదిమందిని సస్పెండ్ చేసింది. సస్పెన్షన్ ఎత్తివేయాలని ఒకవైపు కార్మికులు ఆందోళన చేస్తుండగానే, ఎనిమిదిమంది కార్మికులను ఇతర ప్రాంతాలలోని రీజన్సీ యూనిట్లకు బదిలీ చేసింది. బదిలీలను అంగీకరించని కార్మికులను శాశ్వతంగా తొలగిస్తామని బెదిరించింది. కార్మికులు మరింత సంఘటితపడటాన్ని గమనించిన యాజమాన్యం యూనియన్‌తో ఎలాంటి చర్చలు సాగించకుండా వేతనాలను రు. 650 పెంచుతామని, బోనస్ రు. 1000 చొప్పున చెల్లిస్తామని ఏకపక్షంగా ప్రకటించింది. తద్వారా కార్మిక ఉద్యమాన్ని నీరుగార్చ చూసింది. యాజమాన్యం తమతో చర్చలు జరపాలని, నిర్దుష్టంగా ఒక ఒప్పందం చేసుకోవాలని, ఖచ్చితంగా అమలు చేయాలని కార్మికులు డిమాండ్‌చేస్తూ ఆందోళనను కొనసాగించారు.

కార్మికులపై నిర్బంధం ప్రయోగించటంలో యాజమాన్యానికి పూర్తి దన్నుగా పాండిచ్చేరి ప్రభుత్వం నిలిచింది. రీజన్సీ కంపెనీ ఎదుట లేదా ఆ పరిసరాల్లో కార్మికులు చేపట్టే ధర్నాలు, నిరాహారదీక్షలవంటి ఎలాంటి శాంతియుత ఆందోళనలనైనా శాంతిభద్రతల సమస్యగా పేర్కొంటూ ప్రభుత్వం అనుమతించలేదు. విధిలేని స్థితిలో కార్మికులు పాండిచ్చేరి ప్రభుత్వం విధించిన 200 మీటర్ల పరిధికి వెలుపలే ఆంధ్రా ప్రాంతంలో టెంట్‌లు వేసుకొని నిరాహారదీక్షలు చేపట్టారు.

కాగా, కంపెనీ యాజమాన్యం జనవరి 27వ తేదీన బయట ప్రాంతాల నుండి 150 మంది కూలీలను, కార్మికుల స్థానంలో పనులలో పెట్టేందుకు లోపలికి తీసుకువెళ్తుండగా ఆందోళన సాగిస్తున్న కార్మికులు వారికి నచ్చజెప్పి వెనుకకు పంపే ప్రయత్నం చేశారు.

తాము విధించిన పరిధిదాటి కార్మికులు ముందుకు వచ్చారనే సాకుతో, అప్పటికే పథకం ప్రకారం మోహరించి వున్న పోలీసులు కార్మికులపై తెగబడ్డారు-విచక్షణారహితంగా గొడ్లనుబాదినట్లు బాదారు. అనేకమంది కార్మికులను వ్యానుల్లో కుక్కి స్టేషన్‌కు తరలించారు. వ్యానులోనే యూనియన్ అధ్యక్షుడు మురళీమోహన్‌ను తుపాకీ మడమలతో, లాఠీలతో వళ్ళంతా కుళ్ళబొడిచారు. అపస్మారక స్థితిలో వున్న అతన్ని ఆసుపత్రికి తీసుకెళ్ళకుండా స్టేషన్‌లోనే వుంచి తాత్సారం చేయటం ద్వారా మురళీమోహన్‌ను హత్యగావించారు. ఆ విధంగా కార్మికులకు ఒక హెచ్చరిక చేయదలిచారు.

కానీ కార్మికులు దీనికి బెదరలేదు. అంతటి దుఃఖాన్ని తమాయించుకుంటూనే, తమ యూనియన్ నాయకుని హత్యను నిరసిస్తూ, అరెస్టుచేసిన తమ వారందరి విడుదలను డిమాండు చేస్తూ పోలీసుస్టేషన్ ముందు బైఠాయించి ఆందోళన చేపట్టారు. శాంతియుతంగా ఆందోళన చేస్తున్న కార్మికులపై ఎలాంటి ముందస్తు హెచ్చరికలు చేయకుండా పాశవికంగా సి.ఐ. కాల్పులు సాగించాడు. కాల్పులలో 9 మంది కార్మికులకు తీవ్రగాయాలై కాళ్ళు, చేతులు విరిగిపోయాయి. ఒక కార్మికుని మర్మాంగంలో నుండి బుల్లెట్ దూసుకుపోయింది. యాభైమందికి పైగా కార్మికులకు ఏదో ఒక మోతాదులో బులెట్ గాయాలయ్యాయంటే, నిరంకుశ యాజమాన్యాల పనుపున రాజ్యయంత్రాంగం ఎంతటి రక్తపాతాన్ని సృష్టించగలదనే విషయం రుజువౌతున్నది.

తమపై యాజమాన్యం సాగిస్తున్న దోపిడీ, వేధింపులు; తమ యూనియన్ నాయకుని దారుణహత్య; తమపై ఏకపక్షంగా జరిపిన పోలీసు కాల్పులు; క్షతగాత్రులై రోడ్డుమీదేపడి రక్తమోడుతూ కనీస వైద్యసహాయం అందక విలవిల్లాడుతున్న తమ తోటి మిత్రులను కళ్ళెదుట చూస్తున్న కార్మికుల ఆగ్రహం కట్టలు తెంచుకుంది. దశాబ్దాలుగా అణచివేతను భరిస్తూ, భరిస్తూ వచ్చిన కార్మికుల కడుపు రగిలిపోయింది. ప్రజ్వరిల్లిన కార్మికుల ఆగ్రహాగ్నికి అనివార్యంగా ఫ్యాక్టరీ ఆస్తులు కొన్ని ఆహుతయ్యాయి. అదే ఆగ్రహంతో కార్మికులు కంపెనీ వైస్ ఛైర్మన్‌ను కలసి తమపై సాగుతున్న ఇంతటి దమనకాండకు కారణమైన యాజమాన్యాన్ని నిలదీశారు. ఇది నిస్సందేహంగా కార్మికుల ధర్మాగ్రహమే.

(తరువాయి 3వ పేజీలో)

## కూడంకులమ్ అణువిద్యుత్ కేంద్ర వ్యతిరేక ప్రజా ఆందోళనకు సంఘీభావానికై మేధావుల, ప్రజాస్వామిక వాదుల విజ్ఞప్తి

- **తమిళనాడు** రాష్ట్రం-కూడంకులమ్ అణువిద్యుత్ కేంద్రానికి వ్యతిరేకంగా, కూడంకులమ్ పరిసర 32 గ్రామాల ప్రజానీకం 'అణువిద్యుత్ వ్యతిరేక ప్రజా ఉద్యమం (పిఎమ్ఏఎన్ఇ)' ఆధ్వర్యంలో 2011 ఆగస్టు 16న ఆందోళనను ప్రారంభించారు. 2011 సెప్టెంబరు 11 నుండి రిలే నిరాహార దీక్షలు సాగిస్తూ వస్తున్నారు.
- ఈ ఆందోళనోద్యమం-తిరునేల్వేలి, కన్యాకుమారి, ట్యుటికోరిన్ జిల్లాలలోని వివిధ కులాల, తెగల సమష్టి ఉద్యమంగా వుండటంతో పాటు తమిళనాడు రాష్ట్ర ప్రజానీకపు మద్దతును పొందివుంది. తమిళనాడులోని వివిధ ప్రజా సంఘాలన్నీ పలురకాల ఆందోళనలు, ధర్నాల ద్వారా ఈ ఉద్యమానికి మద్దతును అందిస్తూ వస్తున్నారు.
- ప్రతిపాదిత అణువిద్యుత్ కేంద్రానికి వ్యతిరేకంగా పెరుగుతున్న అసమ్మతి, ఆగ్రహాల వెలుగులో-దక్షిణ తమిళనాడు రాష్ట్రంలోని అన్నికులాల-ముఖ్యంగా మత్స్యకార తెగ(నాడార్‌కులం), దళితకులాలు, మస్లిమ్‌లందరి-సమైక్య ఆందోళనా ఫలితంగా 2011 సెప్టెంబర్ 23న రాష్ట్ర ప్రభుత్వం కూడంకులం అణు విద్యుత్ కేంద్ర నిర్మాణ పనులను తాత్కాలికంగా నిలిపివేస్తూ ఒక తీర్మానం చేసింది. ఆ పిదప 'పోరాట కమిటి' దేశ ప్రధానిని కలసి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించింది.
- మాజీ రాష్ట్రపతి డా॥ ఎ.పి.జె. అబ్దుల్‌కలామ్-కూడుంకులమ్ అణువిద్యుత్ కేంద్రం నూరుశాతం క్షేమకరమైందని, కానీ అణుప్రమాదాలకు నూరుశాతం బాధ్యత వహించటం సాధ్యం కాదని పేర్కొన్నారు. మానవ లేక యాంత్రిక వైఫల్యం; అణుకేంద్రాలలో విధ్వంసకర పరిణామాలకు దారితీసే భూకంపం, త్సునామి వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించబోవని భూమిమీద ఎవ్వరూ గ్యారెంటీ ఇవ్వలేరని కూడా చెప్పారు.
- ప్రభుత్వం నియమించిన 15 మంది సభ్యుల నిపుణుల కమిటీ-పర్యావరణ అంచనానివేదిక, భూ కంపనాల నివేదికలు, భూమి, మట్టికి సంబంధించిన నివేదికలు, అణుకేంద్రాల నిర్మాణ నాణ్యత, పరికరాల, యంత్రాల నాణ్యతల గురించి, అణువ్యర్థాల యాజమాన్యం గురించి ప్రజలు సంధించిన కీలకమైన ప్రశ్నలకు-ఏమీ జవాబివ్వలేదు.
- అణుశక్తి విభాగము, అణు విద్యుత్ కేంద్రము తమ పనులనేమీ ఆపకపోగా, మొదటి అణుకేంద్ర విద్యుదుత్పత్తి వాణిజ్యపర నిర్వహణలకై 2012 మార్చిలో; 2012 డిసెంబరులో రెండవ అణుకేంద్ర విద్యుదుత్పత్తికి సంబంధించిన నిర్ణీత తేదీని ప్రకటించాయి. ఈ ప్రకటనలు ప్రజాభిప్రాయాన్ని నిర్లక్ష్యంచేసేవిగా వుండటంతోపాటు ప్రజాగ్రహాన్ని మరింతగా పెంచాయి. వారి పోరాటాన్ని మరింత తీవ్రం చేశాయి.
- ప్రజలయొక్క ఈ పోరాటం ఉద్వేగాలమీద ఆధారపడినదీకాదు లేదా అశాస్త్రీయ భయాల కారణంగా ముందుకొచ్చిందీకాదు; అంతర్జాతీయంగా అణుకేంద్రాలలో సంభవిస్తున్న ప్రమాదాలపట్ల వెల్లడౌతున్న వాస్తవాలు; జీవానుకూల శాస్త్రవేత్తలు, పర్యావరణ వాదులు అందించే ఖచ్చితమైన వాస్తవాల ఆధారంగా-ఈ ఉద్యమం సాగుతున్నది.
- అణుశక్తి అనేది 'ఆర్థికము-అభివృద్ధి'లకు మాత్రమే పరిమితమైన అంశముకాదు. ఇది మానవ మనుగడ, పర్యావరణాలకు పెనుసవాల్‌గావుంది. సాధారణ స్థితిలో పనిచేస్తున్న అణువిద్యుత్ కేంద్రాలు కూడా అనిర్దిష్టమరణాలు, క్యాన్సర్‌తో సహా పెక్కుప్రమాదాలకు కారణమవుతున్నాయని పలు అధ్యయనాలు వెల్లడిచేస్తున్నాయి. అణువిద్యుత్తు అనుకూల వర్గం ప్రవచించే ప్రయోజనాలు, ఫలితాలవంటివన్నీ నీటమూటలేనని జపాన్-ఫుకిషిమా విపత్తు వెల్లడి చేసింది. కూడంకులం ప్రజల పోరాటం భారతదేశంలోని మారుమూల ప్రాంతంలో ఏకాకిగా సాగుతున్నదికాదు. తక్షణం దృష్టిసారించవలసిన, బాధ్యత వహించవలసిన, మనదేశానికి సంబంధించిన తీవ్రమైన విషయంగావుంది.
- ఈ ఉద్యమానికి నాయకత్వం వహించే నాయకులను వివిధ గ్రామాల ప్రజలను భారత నేరస్మృతిలోని వివిధ చట్టాల క్రింద నిర్బంధించి, పోలీసులు 85 తప్పుడు కేసులు పెట్టారు. మత్స్యకారులపై 3015 కేసులు నమోదు చేసినట్లుగా 2011 నవంబర్ 22న 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్'లో ప్రచురితమైన వార్త కలవరపరిచేదిగావుంది. వీరిలో మత్స్యకారుల నాయకుడైన యస్‌పి ఉదయ్‌కుమార్‌కూడా వున్నారు. 2011 నవంబర్ 21న అణువిద్యుత్ కేంద్ర సమీపంలో-సముద్రంలోని తమ పడవలపై నల్లజెండాలను ఎగురవేసి శాంతియుతంగా తమ నిరసనను తెలియపరిచినందుకుగానూ వివిధ సెక్షన్ల క్రింద వీరిపై కేసులు నమోదు చేయటంతోపాటు 121వ సెక్షను (రాజ్యానికి వ్యతిరేకంగా తిరుగుబాటు సాగించటం) 124-ఎ సెక్షను (రాజద్రోహం) నేరాలపై కేసులు నమోదు చేశారు. వాస్తవానికి నవంబర్ 21వ తేదీ ప్రపంచ మత్స్యకారుల దినం. కాగా అదే రోజున మత్స్యకారులు-సముద్ర సంపదకు పెనుముప్పుగా పరిణమించిన అణువిద్యుత్ కేంద్రానికి వ్యతిరేకంగా నిరసనదినంగా పాటించారు.
- డా॥ పూగార్ఝొంతి అనే గోల్డ్‌మెడల్ పొందిన ఒక వైద్యుడిని ప్రభుత్వం వేధింపులకు గురిచేస్తున్నది. అణుధార్మికత కారణంగా సంభవించే దుష్ఫలితాలపై పరిశోధన చేసిన వానిగా తనకున్న అనుభవంతో, ఈ వైద్యుడు కల్పకం అణువిద్యుత్ కేంద్ర పరిసర ప్రాంతాలలో సంభవిస్తున్న అనారోగ్యాలపై ప్రజలకు వైద్యం అందిస్తూ, వారిని విజ్ఞానవంతం చేస్తూ వస్తున్నాడు. 2011 డిసెంబర్ 1వ తేదీన స్థానిక పోలీసులు ఈ వైద్యుడిని పిలిపించి ప్రజలను విజ్ఞానవంతం చేసే అతని పనులను ఆపకుంటే దేశ భద్రతా చట్టంక్రింద అరెస్ట్ చేయటమో లేదా పోలీసు ఎన్‌కౌంటర్లో కాల్చి చంపటమో చేస్తామని హెచ్చరించారు. కూడంకులమ్ అణువిద్యుత్ కేంద్రమే ఒక మానవహక్కుల ఉల్లంఘనగా అది వుంది.

(తరువాయి 6వ పేజీలో)

# ఉత్తరప్రదేశ్ శాసనసభ ఎన్నికలు - సిపిఐ (ఎం-ఎల్) పిలుపు

**ఉత్తరప్రదేశ్** 16వ శాసనసభ ఎన్నికల క్రమం ఇప్పటికే ప్రారంభమైంది. కాంగ్రెస్, బిజెపి, యస్‌పి, బియస్‌పి వంటి పాలకవర్గాల విశ్వసనీయమైన పార్టీలు, రాష్ట్రంలో అధికారాన్ని కైవసం చేసుకునేందుకు ఒకరిపై మరొకరు రాళ్ళు రువ్వుకుంటున్నాయి. వీటితోపాటుగా కుల, మత, ప్రాంతీయ పార్టీలన్నీ వాటివాటి అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. వీరు ఒకరినొకరు తీవ్రంగా విమర్శించుకున్నట్లు కన్పించినా వీరందరిలో ఒక సాధారణత్వంవుంది.

మొదటిది-వీరందరికీ ఒక సిద్ధాంతం లేదా ఆదర్శాలు అనేవి లేవు.

రెండవది-ఏ పార్టీకీ ఒక స్పష్టమైన రాజకీయ విధానం లేదు. వీరిలో ఎవరూ గాంధీ వాది కాదు, హిందుత్వ వాది కాదు, నెహ్రూ వాది కాదు, లోహియా వాది కాదు, సమానత్వవాదికాదు, అంబేద్కర్ వాదీ కాదు. ఇతరపార్టీల నుండి ఫిరాయింపు దారులను చేర్చు కోవటంలో వీరెవరికీ తటపటాయింపులు లేవు. శాసన సభలో అధిక సీట్లను కైవసం చేసుకోవటం పైననే వీరి దృష్టిఅంతా. అతనొక బ్లాక్ మార్కెట్ చేసేవాడు కావచ్చు, నేరచరితుడు కావచ్చు, గూండాకావచ్చు, కులతత్వవాది, మతతత్వవాదీ కావచ్చు...ఎన్నికలలో నెగ్గేందుకు కావలసినంత నల్లధనాన్ని అతను ఖర్చుపెట్ట గలిగిన వాడై వుండాలి. ఎవరికైనా పైన పేర్కొన్న లక్షణాలన్నీవుంటే, అతనే అత్యంత మంచి అభ్యర్ధి కాగలుగతాడు.

మూడవది-ఎన్నికల సందర్భంగా వాగ్దానాలు చేయటం, ఆపై వాటిని మరచిపోవటమనేది ఈ పార్టీలన్నింటి సాధారణాంశంగా వుంది. పద్ధతి ఏదైనా కానీ, ఎన్నికల్లో నెగ్గటమే వీరి ఏకైకలక్ష్యం!

నాలుగవది- ప్రస్తుతపెట్టుబడిదారీ పార్లమెంటరీ వ్యవస్థలో (దురదృష్టవ శాత్తూ, అదే ప్రజాస్వామ్యంగా పిలవబడుతున్నది) ఈ పార్టీలన్నింటి వాస్తవస్వభావం అప్రజాస్వామికమైంది. అధిష్టానమే అన్నింటినీ నిర్ణయిస్తుంది. అభ్యర్ధులందరినీ అదే ఎంపిక చేస్తుంది. పార్టీ కార్యకర్తలకు, ప్రజలకు దీనితో ఏ విధమైన సంబంధంలేదు. అధిష్టానానికి విధేయంగా వుండటమే వారు కోరుకునే ఒకే ఒక్క లక్షణంగా వుంది. నాయకుల చేతిలో వీరంతా కీలుబొమ్మలు. ఈ పార్టీలలో అంతర్గత ప్రజాస్వామ్యం లేనప్పుడు ఈ దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థను వీరెలా స్థాపించగలుగుతారు? దానికి అవకాశమే లేదు. ఈ కారణంగా 90 శాతం ప్రజానీకానికి ఓట్లు వేయటం మినహా మరే రాజకీయ హక్కులూ లేవు.

ఐదవది-ఎన్నికల అనంతరం ఎవరు, ఏ గూటికి చేరుతారో ఎవరూ ఊహించలేరు. పరిపాలనాధికారాన్ని పొందటం కోసం 'గుర్రపుపందేలు' సాగిస్తారు. ఎన్నికలనేవి రాజకీయపోరాటం, రాజకీయాల ప్రాతిపదికనే ఈ పోరాటం కొనసాగితీరాలి. కానీ ప్రతిపార్టీ ఒకకుటుంబ జాగీరుగా మారిపోయింది. ఈ పార్టీలు తమ స్వంత పార్టీ సభ్యులపట్ల విశ్వాసాన్ని కోల్పోయాయనేది దీని అర్ధం.

భారత రాజకీయ వ్యవస్థలో ప్రజాస్వామ్యం కనుమరుగవటమనేది కొట్టొచ్చినట్లు కనబడే లక్షణంగా వుంది. ప్రతిరాజకీయపార్టీ అధికార కేంద్రీకరణ దిశగా సాగిపోతున్నది. అవినీతి, నల్లధనం, పెరుగుతున్నధరలు, నిరుద్యోగం, మహిళల, దళితుల, ఆదివాసుల అణచివేత; ఆకలిచావులు; రైతులపై, కార్మికులపై ఫ్యూడల్ అణచివేత, దోపిడీ వంటి ప్రజానీకం ఎదుర్కొనే తీవ్రమైన సమస్యలకు వీరి ఎజెండాలో స్థానంలేదు. అర్ధ, అంగబలాలు కలిగిన మతతత్వ, కులతత్వ విభాగాలవైపు, వాటి కూటములవైపు వీరంతా కొట్టుకుపోయివున్నారు. ఈ విధంగా తమకు ఓటు వేయవలసిందిగా ప్రజలకు ఎరవేస్తున్నారు. అధికస్థానాలను సాధించిన పార్టీ భారత పాలక వర్గాలకు అంటే భూస్వాములకు, బడా పెట్టుబడిదారులకు, విదేశీ పెట్టుబడిదారులకు సేవ చేసేందుకు అధికారాన్ని కైవసం చేసుకుంటుంది.

## ఉత్తరప్రదేశ్‌లోని నాలుగు ప్రధాన పార్టీల వాస్తవ స్వభావం

యు.పిలోని నాలుగు ప్రధాన పార్టీల నొక్కసారి పరిశీలిద్దాం. కాంగ్రెస్ నాయకత్వంలోని యు.పి.ఎ., కేంద్రంలో అధికారంలో వుంది. దీనికి బియస్‌పి మద్దతు లేదా సహకారం కేంద్రంలో వుంది. ఇదేపార్టీ ఉత్తర ప్రదేశ్‌లో అధికారంలోవుంది. యస్.పి. ఈ రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగావుంది. బిజెపి పాత్ర ఏమిటో చూద్దాం.

మన్మోహన్‌సింగ్ మొదటివిడత ప్రధానిగావున్న కాలంలో అమెరికా ప్రాయోజితమైన అణువిద్యుత్ కార్యక్రమానికి మద్దతుగా పార్లమెంటు సభ్యుల 'మద్దతు'ను కొనుగోలుచేసే సందర్భంలో యస్.పి., కాంగ్రెస్‌కు మద్దతుగా నిలిచింది. పార్లమెంట్ సమావేశాలకు ఈ సందర్భంగా హాజరుకాకుండా ఈ బిల్లు ఆమోదం పొందటానికి బి.యస్.పి. సహకరించింది. బిజెపి నామమాత్రంగా వ్యతిరేకించింది.

కాంగ్రెస్, బిజెపి, యస్‌పి, బియస్‌పి పార్టీలన్నీ మహిళా రిజర్వేషన్ బిల్లు విషయంలో ప్రజలను మోసగించటంలో సఫలీకృతమైనవే. అన్నాహజారే అవినీతి వ్యతిరేక ఉద్యమ వత్తిడి నుండి మన్మోహన్ సింగ్ ప్రభుత్వం లోక్‌పాల్ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టింది. కానీ ఈ బిల్లు పరిధినుండి ప్రధానమంత్రిని, సుప్రీంకోర్టు న్యాయమూర్తులను, బహుళజాతి కంపెనీలను, ప్రభుత్వేతర సంస్థలను మినహాయించింది. ఈ బిల్లుపై జరిగిన ఓటింగ్‌కు గైరుహాజరు కావటం ద్వారా యస్‌పి, బి.ఎస్.పి.లు రెండూ ఈ బిల్లు లోక్ సభలో ఆమోదం పొందటానికి అవసరమైన బలాన్ని కాంగ్రెస్ ప్రభుత్వానికందించాయి.

విదేశీ బ్యాంకుల్లో దాచివుంచిన నల్లధనంపై పాలకులు చర్యలేమీ తీసుకోకపోవటాన్ని నిరసిస్తూ ఢిల్లీలో ప్రజానీకం ప్రదర్శన జరుపుతుంటే ఒక మహిళా ఆందోళనకారిణిని చంపివేయటంతోపాటు ప్రజలపై క్రూర నిర్బంధాన్ని ప్రయోగించారు. దేశవ్యతిరేకమైన, అవినీతిమయ కాంగ్రెస్ పాలనలో నీతినియమాలులేని వారంతా విచ్చలవిడిగా తిరుగుతూవుంటే, ప్రజల ప్రజాస్వామిక హక్కులు మాత్రం ఈ విధంగా హరించివేయబడుతున్నాయి.

పెట్టుబడిదారులు ఉత్పత్తి చేసిన సరుకులధరలను పెంచుకోవటానికి వారికి అనుమతినిచ్చిన ప్రభుత్వం, వ్యవసాయ ఉత్పత్తుల ధరలను నియంత్రిస్తూ రైతాంగాన్ని నాశనం చేస్తున్నది. ఎఫ్.డి.ఐ.ని ప్రోత్సహించటం పేరున దేశవనరులన్నింటినీ లూటీ చేసుకోవటానికి విదేశీ గుత్తపెట్టుబడి దోపిడీకి వరదగేట్లను తెరిచింది.

గత 8 నెలల కాలంలో పెట్రోలు, డీజిలు, ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారకాలపై ప్రభుత్వం సబ్సిడీలను పలుమార్లు తగ్గించి వేస్తూ, మరోవైపున 29 లక్షలకోట్ల పన్నురాయితీలను బడాబూర్జువా వర్గానికి కల్పించింది.

కాంగ్రెస్, బిజెపి, యస్‌పిల పైస్థాయి నాయకులందరూ దళారీ పెట్టుబడిదారీవర్గానికి అనుకూలంగా నిర్ణయాలు తీసుకుంటూ 2జి కుంభకోణం, ఆదర్శ్‌సొసైటీ, ఇనుపఖనిజ కుంభకోణంవంటి పలుకుంభకోణాలకు పాల్పడుతూ పెద్దఎత్తున సంపదను కూడబెడుతున్నారు. ములాయంసింగ్ యాదవ్, మాయావతిల ఆదాయాలపై ఇప్పటికే ఒక విచారణ కొనసాగుతున్నది. వాస్తవానికి యు.పి. ప్రభుత్వంలోని రెండుడజన్ల పైగా మంత్రులు అవినీతి ఆరోపణల కారణంగా వారిస్థానాలనుండి తొలగించబడ్డారు.

గ్రామీణ ఉపాధి హామీపథకం, ప్రజాపంపిణీ వ్యవస్థ, కరువు, వరదసహాయక చర్యల వంటి పలు సంక్షేమ పథకాలకుద్దేశించిన నిధులను, బడా కాంట్రాక్టర్లు, ప్రభుత్వేతర సంస్థలు, నాయకులు, ఉన్నతాధికారులు, మంత్రులు, పెట్టుబడిదారులందరూ చేతులు కలిపి లూటీ చేస్తున్నారు. రహదారులు, విద్య, ఆరోగ్యం, చిన్నతరహా పరిశ్రమలు, జాతీయరహదారులు, బడా నిర్మాణ పథకాలకు కేటాయించిన నిధులన్నీ దుర్వినియోగమౌతున్నాయి.

బ్రిటీష్ వలస పాలకుల నుండి అధికారమార్పిడి జరిగిన సమయంలో, మన దేశంలో కేవలం 32 మంది మాత్రమే కోట్లాధిపతులుగా వున్నారు. ఈ రోజు ఆ సంఖ్య 1200కి పెరిగింది. వారి మొత్తం సంపద 475 ట్రిలియన్ రూపాయలు-అంటే దేశ జాతీయోత్పత్తిలో 75 శాతం! అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన పైస్థాయినాయకులు, ఉన్నతాధికారులు, బడావ్యాపారులు, పెట్టుబడిదారులు విదేశీ బ్యాంకులలో దాచివుంచిన నల్లధనం 80 లక్షల కోట్లరూపాయలని అంచనా!

మూఢనమ్మకాల కారణంగా దేవాలయాలకు ప్రజలు విరాళాలు అందజేస్తున్నారు. ఈ డబ్బు నిరుపయోగకరంగా ప్రక్కన పెట్టబడుతున్నది. నల్లధనం కానీ, దేవాదాయ నిధులు కానీ భారత శ్రామిక ప్రజల ఫలితమే! మరోవైపున 290 మిలియన్‌ల ప్రజానీకం 6 రూపాయల రోజువారీ వేతనంపై జీవిస్తుండగా, మరో 260 మిలియన్ల ప్రజలు రోజుకు 11 రూ॥ ఆదాయంతో జీవిస్తున్నారు.

కళ్ళు చెదిరే అభివృద్ధి అంటే ఇదేనా?! 'ప్రకాశించే భారతదేశం' -సామ్రాజ్యవాదుల, దళారీ బూర్జువాల ఫ్యూడల్ వర్గాల దోపిడీకి, వారి విచ్చలవిడి లాభాల వేటకు 'స్వర్గధామం' తప్ప వేరుకాదు. రాష్ట్రంలోని ఈ నాలుగు ప్రధాన పార్టీలు, దోపిడీవర్గాల ప్రయోజనాలను పరిరక్షించేవే. ఈ పార్టీలన్నీ ప్రజల జీవితాలను మరింత దుర్భరంచేసే సరళీకరణ, ప్రైవేటీకరణ, గ్లోబలీకరణ విధానాలను అమలు చేసేవే. అధికారాన్ని చేజిక్కుంచుకొనే వారి పరుగులో ప్రజల ప్రజాస్వామిక హక్కులన్నింటినీ కాలరాయటంతోపాటు ప్రజాస్వామ్యమనే దానినే వారి చేతిలో కీలుబొమ్మగా చేసుకున్నారు. కనుక, మనం ఏమి చేయాలి?

ఈ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటూనే ప్రజలు- తమ ప్రజాస్వామిక హక్కులను గుర్తెరిగి తమ సమస్యల పరిష్కారానికై ఐక్యంగా పోరాటాలకు సిద్ధంకావాలని, ప్రజలకు పిలుపునిస్తున్నాం.

1. మన దేశంలో ఐఎంఎఫ్, ప్రపంచబ్యాంకు విధించిన షరతుల ద్వారా రుద్దుతున్న నూతన తరహా బానిసత్వంతో తెగదెంపులు చేయాలి.
2. అభివృద్ధి పేరుతో బహుళ జాతి కంపెనీలు, భారతీయ కార్పొరేటు పరిశ్రమలు పెద్దఎత్తున సాగిస్తున్న నీరు, ఆడవి, భూమి ఖనిజాలు మరియు ఇతర సంపదల లూటీని అరికట్టాలి.
3. 'సెజ్' వంటి ప్రజావ్యతిరేక, జాతి వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేయాలి.
4. పెట్రోలు, డీజిల్, వంటగ్యాసు వంటి పెట్రో ఉత్పత్తుల ధరల పెరుగుదలను నిలుపుదల చేయాలని డిమాండ్ చేయాలి.

## ప్రజలప్రజాస్వామిక హక్కులకై

1. ప్రజా వ్యతిరేకులు, అవినీతిపరులు, నల్లవ్యాపారులు, నేరస్థులు, భూ మాఫియా వంటి ప్రజాకంటకులుగా వున్న అభ్యర్ధులను తిరస్కరించే హక్కు కోసం ఐక్యంగా పోరాడాలి.
2. ప్రజావ్యతిరేక చర్యలకు పాల్పడినందుకు, వాగ్దానాలను ఉల్లంఘించినందుకు ఎన్నికైన ప్రజాప్రతినిధులను వెనుకకు రప్పించే హక్కుకోసం ఐక్యపోరాటాలు సాగించాలి.
3. పోరాడి సాధించుకున్న హక్కులను నిలుపుకునేందుకు, ఆ హక్కులను హరించటానికి వ్యతిరేకంగానూ ఐక్యంగా పోరాడాలి.
4. కార్మికులు, రైతులు, విద్యార్ధులు, యువకులు, మహిళలు, దళితులు, వెనుకబడిన కులాల ప్రజలు, ఆదివాసీలు, ప్రజాస్వామిక, ప్రగతిశీల, దేశభక్తియుత రచయితలు, కళాకారులు, ఉపాధ్యాయులు, సామాజిక కార్యకర్తలు, స్థానిక చేతివృత్తిదారులు మరియు ప్రజానుకూల మేధావులను ఒకే వేదికపైకి సమీకరించటానికి, ఐక్యం చేయటానికి కృషి చేయాలి.
5. పనిహక్కుకోసం ఐక్యపోరాటాలు సాగించాలి.

## ప్రజా సమస్యల పరిష్కారానికై

1. కూడు, గూడు, గుడ్డ, విద్యా, వైద్యం, భద్రత, సాంస్కృతికవికాసంవంటి కనీస అవసరాలకు సరిపడే జీవనానికి తగిన వేతనం కోసం పోరాడాలి.
2. మూసివేసిన, లాకౌట్ ప్రకటించిన మిల్లులను, ఫ్యాక్టరీలన్నింటినీ వెంటనే తెరిపించాలి.
3. అసంఘటితరంగంలోని కార్మికులను ఏ విధమైన రుసుం లేకుండానే నమోదు చేసుకొని, సంఘటితరంగ విభాగంలో కార్మికులకు లభించే సౌకర్యాలన్నింటినీ, ఇంటి వసతితో సహా హక్కులన్నింటికోసం ఐక్యంగా పోరాడాలి.
4. సమానపనికి సమాన వేతనానికై పోరాడాలి.
5. సంవత్సరం పొడవునా ఉపాధికోసం, జీవనానికి తగిన వేతనం కోసం, గ్రామీణ నిర్మాణ కార్మికులను, వ్యవసాయ కూలీలను, ఎన్‌ఆర్‌ఇజిఏ కార్మికులను నమోదు చేయాలని పోరాడాలి.
6. కౌలుదారుల హక్కులను పరిరక్షించే చట్టం కోసం పోరాడాలి.

## వ్యవసాయ రంగ స్వయం ఆధారిత అభివృద్ధికై

1. అభివృద్ధి పేరిట సారవంతమైన భూముల గుంజివేతను వెంటనే ఆపివేయాలి.
2. వ్యవసాయానికి అవసరమైన ఉత్పత్తుల తయారీకి కావలసిన పరిశ్రమల నిర్మాణాన్ని డిమాండ్ చేయాలి.
3. సమానత్వ, శాస్త్రీయ విద్య అమలుకై డిమాండ్ చేయాలి.
4. వ్యవసాయానికి అవసరమైన ఎరువులు, పురుగుమందులపై గతంలో కల్పించిన సబ్సిడీలను కొనసాగించాలని డిమాండ్ చేయాలి.
5. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలకై డిమాండ్ చేయాలి.
6. ఉత్తరప్రదేశ్ శీతల గిడ్డంగుల విధానం-1974ను తిరిగి అమలు చేయాలని డిమాండ్ చేయాలి.
7. చెరకు రైతాంగానికి చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేయాలి.
8. అన్ని ప్రభుత్వ శాఖలు, విభాగాలలో విస్తారంగా వ్యాపించిన అవినీతిని అంతమొందించటానికి పోరాడాలి.
9. గ్రామీణ ప్రాంతాలలో 3 కి.మీ. పరిధిలో ఒక పశువైద్యశాలను; ఎంబిబిఎస్ డాక్టరు కలిగిన ఒక వైద్యశాలను నిర్మించాలి.

## ప్రియమైన ప్రజలారా!

మన రాష్ట్రంలోనూ, దేశవ్యాపితంగానూ అతిసంక్లిష్టమైన, కష్టభరితమైన, సిగ్గుపడే పరిస్థితుల నడుమ ఉత్తరప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఏ పార్టీగానీ, పాలకవర్గాలకూటమిగానీ ప్రజల సమస్యలను పరిష్కరించలేవు, ప్రజల ప్రజాస్వామిక హక్కులు పరిరక్షించలేవు. ప్రస్తుత అప్రజాస్వామిక పార్లమెంటరీ వ్యవస్థనుండి బయటపడేయలేవు. ఈ పక్షాలేవీ వామపక్ష, ప్రగతిశీల ప్రజాస్వామిక అభ్యర్ధులను చట్ట సభలకు పంపుతాయని ఆశించలేము.

సింగూరు, నందిగ్రామ్, కళింగనగర్, నియంగిరి, జార్ఖండ్, దాబరాయ్, తప్పాల్, భాట్టా-పార్‌సోల్, కర్చానా, ఆగ్రా, చందౌలీ, జోన్‌పూర్ తదితర ప్రాంతాలలో భూసేకరణకు వ్యతిరేకంగా నిరంతరాయంగా ప్రజలు సాగించిన ఉద్యమాల ఫలితంగానే కొంతమేరకు ఉపశమనం పొందగలిగారని, ప్రజాఉద్యమాల వత్తిడి ఫలితంగానే 1894లో బ్రిటీష్ పాలకులు రూపొందించిన భూ సేకరణచట్టాన్ని ఈ నాటికి మార్పు చేయటానికి పాలకులు పూనుకున్నారనే అంశాన్ని మన రాష్ట్రంలో ప్రజానీకం దృష్టికి తేదలుచుకున్నాము. జనలోక్‌పాల్ బిల్లుగా చెప్పబడుతున్న దానికోసం అన్నా హజారే సాగిస్తున్న ఉద్యమం, లోక్‌పాల్‌బిల్ లోక్ సభలో ప్రవేశ పెట్టడం జరిగింది. అలాగే 80 లక్షల కోట్ల నల్లధనాన్ని వెనక్కు రప్పించేందుకు కనీసం చర్చ ప్రారంభమైందనేది గమనమంలో ఉంచుకోవాలి. అయినప్పటికీ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలలో ఎలాంటి మార్పునూ చూడలేము. ప్రస్తుత దోపిడీ వ్యవస్థకు నూతన ప్రజాస్వామిక వ్యవస్థమాత్రమే ప్రత్యామ్నాయం. దీనికి వ్యవసాయక విప్లవం ఇరుసు. ఈ విప్లవానికి నిర్ణాయకశక్తి ప్రజలు మాత్రమే. కార్మిక, కర్షక, యువజన, విద్యార్ధి, మహిళలను; ప్రగతిశీల, ప్రజాస్వామిక, నిజాయతీకల రాజకీయ వేత్తలు, సాంస్కృతిక కార్యకర్తలు, ప్రజానుకూల మేధావులను సంఘటిత పరచటం ద్వారానే ఈ బృహత్తర కేంద్ర కర్తవ్యం సాధించటం సాధ్యమౌతుంది. ఈ పరిస్థితులలో ప్రజల డిమాండ్ల సాధనకోసం ఈ ప్రచార క్రమంలో సాగించే ఐక్యత - పోరాటం నూతన ప్రజాస్వామిక విప్లవంలో భాగంగానూ, నూతన ప్రజాస్వామిక వ్యవస్థను సాధించే దిశగానూ ఈ ఎన్నికల ప్రచార కార్యక్రమం దీనికొక సంఘీభావాన్ని, సహకారాన్ని అందించేదిగానూ కొనసాగాలి.

నిజాయితీకలిగిన, ప్రగతిశీల, ప్రజాస్వామిక అభ్యర్ధులకు మీ ఓటు వేయటంద్వారా బాధ్యతాయుత వామపక్ష అభ్యర్ధిని ఎన్నుకోవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాము.

**25-1-2012** **ఉత్తరప్రదేశ్ రాష్ట్రకమిటి**
**సిపిఐ (ఎం-ఎల్)**

కాంతి కేంద్రాలా!
మృత్యు మందిరాలా ?
పరమాణు విద్యుత్ శక్తి గురించిన శాస్త్ర, సాంకేతిక, జీవావరణ, ఆర్థిక, రాజకీయ విశ్లేషణ
సి. పి. డి. ఆర్. అధ్యయన బృందం నివేదిక
వెల: రు. 15/-
మైత్రి బుక్ హౌస్
28-9-1, జైలీ వీధి,
ఏలూరురోడ్, విజయవాడ

# సిరియా 'ప్రభుత్వ మార్పిడి' నాటక ప్రదర్శన

**గత** అనేక దశాబ్దాలుగా అమలు చేస్తున్న, ఇటీవలే లిబియాలో అమలు చేసిన వ్యూహాన్నే అమెరికా సామ్రాజ్యవాదం సిరియాలో అమలు జరపబూనుకుంది. సిరియా ప్రజల తరపున మాట్లాడుతున్నామని చెప్పుకుంటూ అమెరికాసామ్రాజ్యవాదుల ప్రయోజనాలకు సేవచేసే కొన్ని గ్రూపులకు ఆయుధాలందజేయటం, ఆ గ్రూపులు ప్రభుత్వ కార్యాలయాలపై దాడులు చేయటం, దీనికి ప్రతిగా అక్కడి ప్రభుత్వం స్పందించి రక్షణ చర్యలు తీసుకుంటే అమెరికా సామ్రాజ్యవాదం ఊచకోత, మారణకాండ అంటూ యాగీ చెయ్యటం; ఐక్యరాజ్య సమితి మానవహక్కుల ఉల్లంఘన అంటూ తీర్మానం చేయటం, అది చేతపుచ్చుకుని మానవీయ జోక్యమంటూ అమెరికా సామ్రాజ్యవాదం సైనిక దురాక్రమణ సాగించటం-ఇదీ ఆ వ్యూహం.

వివిధ అరబ్ దేశాలలో గత ఏడాది దోపిడీ అణచివేతలకు వ్యతిరేకంగా పెల్లుబికిన వెల్లువను తన దోపిడీ, ఆధిపత్య ప్రయోజనాలనీడేర్చే సైనిక దురాక్రమణకు సాధనంగా మలిచేందుకు ఈ వ్యూహాన్నే అమెరికా సామ్రాజ్యవాదం వాడుతున్నది.

ఈ వ్యూహం కొత్తగా అమలు జరుపుతున్నదేమీ కాదు. ఆఫ్రికా ఖండంలోని దేశాలపై సాగించిన అనేక దురాక్రమణ యుద్ధాలలో అమెరికా యూరోపు సామ్రాజ్యవాదాలు వాడాయి. జాతుల మధ్య వైరాన్ని రెచ్చగొట్టే భాతృహత్యాసదృశ మారణకాండను ప్రోత్సహించి అక్కడి ఖనిజవనరులను ఆక్రమించు కున్నాయి. కాంగోలో సామ్రాజ్యవాదులు అమలు జరిపిన ఈ వ్యూహం ఫలితంగా సాగిన మారణకాండలో 50 లక్షల ఆఫ్రికన్లు మరణించారు.

రష్యాకు అనుకూలంగా వున్న ఆఫ్ఘనిస్తాన్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు ఇస్లాం మతోన్మాదశక్తులకు ఆయుధాలను ధనాన్ని అమెరికా అందజేసింది. తన అనుకూల ప్రభుత్వాలు కూలిపోయే స్థితిలో రష్యా పంపిన సైన్యాలను ఎదుర్కొనే పేరిట మతోన్మాద శక్తులకు మద్దతు పెంచింది. ఆనాటి నుండి ఆఫ్ఘనిస్తాన్ రక్తమోడుతూనేవుంది.

యుగోస్లావియా దేశాన్ని ముక్కలు చేసేందుకు ఇదే వ్యూహాన్ని సామ్రాజ్యవాదులు వాడారు. కోసావో విముక్తి సైన్యాన్ని ఏర్పాటు చేసి, దానికి ఆయుధాలు, నిధులు అందజేసి దానితో యుగోస్లావియా ప్రభుత్వంపై టెర్రరిస్టు దాడులు చేయించింది, అమెరికా సామ్రాజ్యవాదమే. దీనిని అణచేందుకు ఆ ప్రభుత్వం పూనుకోగానే మారణకాండ సాగుతున్నదంటూ గగ్గోలు పెట్టింది. తదుపరి యుగోస్లావియాపై "మానవీయ దురాక్రమణ" చేసింది. అక్కడ అది నెలకొల్పిన కోసావో ప్రభుత్వమన్నది అమెరికాకు నమ్మిన బంటుగా వుంది. పుంజీడు దేశాలు మాత్రమే దానిని గుర్తించాయి.

లిబియాపై దురాక్రమణనూ, దాని అధ్యక్షుడు గడ్డాఫీ హత్యనూ ఈ వ్యూహాన్ని అమలు జరిపే, అమెరికా సామ్రాజ్యవాదం సాగించింది.

ఈ చరిత్రే ఇప్పుడు సిరియాలో పునరావృతం కాబోతున్నది.

అమెరికా ప్రభుత్వమూ దాని బాకాలైన పత్రికలూ ఫ్రీసిరియన్ ఆర్మీ (సిరియా స్వేచ్ఛా సైన్యం) అన్నదానిని ఆకాశానికెత్తి పొగడుతున్నాయి. సిరియా పాలకుడు అస్సాద్‌ను పదవి నుండి తొలగించాలని కోరుకుంటున్న సిరియా ప్రజల ప్రతినిధిగా దానిని చిత్రిస్తున్నాయి. దాని నాయకత్వంలో సిరియా ప్రజలు ప్రభుత్వ వ్యతిరేక ప్రదర్శనలు సాగిస్తున్నారనీ నేడోరేపో అస్సాద్ పాలన అంతమైపోతుందని ప్రచారం సాగించాయి.

ఈ ఫ్రీ సిరియన్ ఆర్మీ అన్నది అమెరికా ఏర్పాటు చేసిన సాయుధ గ్రూపు. టర్కీ ద్వారా దీనికి సహాయమందజేస్తున్నది. అమెరికా ప్రభుత్వ పత్రిక "ఫారిన్ అఫైర్స్" ఇలా వ్రాసింది : ఫ్రీసిరియా ఆర్మీ స్థావరాలపై సిరియా సైన్యం పెద్ద యెత్తున దాడులు ఎందుకు చేయటంలేదు? టర్కీతో సరిహద్దులకు ఒక మైలు దూరంలోనే ఇవి వున్నాయి. దాడిచేస్తే అవి టర్కీలోకి వెళ్ళిపోయి దాక్కుంటాయి". ఆ పత్రికే ఫ్రీసిరియా ఆర్మీసభ్యుడి మాటలను ఉల్లేఖించింది. "మాలో ప్రతిసాయుధ గ్రూపుకు టర్కీతో పనివుంది. మా కదలికలకు టర్కీ స్వేచ్ఛనిచ్చింది".

ఈ ఫ్రీసిరియా ఆర్మీ ప్రతినిధి ఒకరు "విమానాలు ఎగురకూడని" ప్రాంతాలుగా ప్రకటించాలని కోరినట్లు అదే పత్రిక వ్రాసింది. అమెరికా తైనాతీ ప్రభుత్వాలున్న టర్కీ, ఇరాన్, జోర్డాను దేశాలతో ఉన్న సరిహద్దు ప్రాంతాలను ఇలా ప్రకటించాలట. అంటే దాదాపు సగం దేశంపై సిరియా విమానాలు ఎగరకుండా చెయ్యబోతున్నదన్న మాట (ఇక్కడ ఇలాంటి తీర్మానాన్నే ఐ.రా.స. చేసి లిబియాపై అమెరికా దురాక్రమణకు పచ్చజండా వూపిన సంగతి గుర్తు చెయ్యనక్కరలేదు)

ఫ్రీ సిరియా ఆర్మీకి అమెరికా మద్దతుపై ఏ సందేహమూ మిగలకుండా రష్యా విదేశాంగ మంత్రి లవరోవ్ "విదేశీ ప్రభుత్వాలు సిరియాలోని మిలిటెంట్లకు టెర్రరిస్టులకు ఆయుధాలందజేస్తున్నా"యని ఐరాస సమావేశంలో చెప్పాడు. ఇంతేకాక "సిరియా, ఇరాన్‌ల పట్ల అమెరికా అనుసరిస్తున్న విధానం పెద్దయుద్ధానికి దారితీస్తుంద"ని అన్నాడు. దాన్ని నివారించటానికంటూ ఒక ప్రతిపాదన చేశాడు. అది ఎన్నికలు జరిగేవరకూ ప్రస్తుత ప్రభుత్వాన్ని కొనసాగనివ్వటం. అమెరికా ఈ ప్రతిపాదనను తిరస్కరించింది. ఇలాంటి తీర్మానాన్నే యెమెన్ విషయంలో ఐరాస చేయటానికి అమెరికా అంగీకరించింది. ఎందుకంటే యెమెన్ పాలకుడు అమెరికా చెప్పుచేతల్లో వున్నాడు. సిరియా పాలకుడు అస్సాద్ అమెరికాను వ్యతిరేకిస్తున్నాడు. కనుక అతను కొనసాగకూడదు.

అదే ఐరాస మరో తీర్మానాన్ని చేసింది. 2011 డిసెంబరు 26న సిరియాలో జరుగుతున్న మానవహక్కుల ఉల్లంఘనను ఖండిస్తూ అది తీర్మానం చేసింది. ఇక మిగిలింది దురాక్రమణకు ఆమోదం తెలిపే మరో తీర్మానాన్ని ఐరాసతో చేయించటమే.

దీనికి వారం రోజుల ముందు నయానాజీలను ఖండిస్తూ ఐరాసలో ప్రతిపాదించిన తీర్మానానికి అనుకూలంగా 132 దేశాలు, వ్యతిరేకంగా 24 దేశాలూ ఓటు చేయగా 31 దేశాలు గైర్హాజరయ్యాయి. ("సమకాలీన రూపాలలో జాతీయ ఉన్మాదాన్నీ, జాతివివక్షనూ, సంబంధిత అసహనాన్ని పోత్సహించే అనుమతించరాని కొన్ని ఆచరణలు"-ఆ తీర్మానం శీర్షికయింది.) ఈ తీర్మానానికి వ్యతిరేకంగా ఓటు చేసిన దేశాలే సిరియాలో మానవ హక్కుల ఉల్లంఘనలను ఖండించే తీర్మానాన్ని ప్రతిపాదించి అనుకూలంగా ఓటు చేశాయి. మానవాళి పట్ల క్షమించరాని నేరాలు సాగించిన నాజీయిజాన్ని పునరుజ్జీవింపచేసే ప్రయత్నాలను ఖండించే తీర్మానాన్ని వ్యతిరేకించేవారు - మానవ హక్కుల ఉల్లంఘనల గురించి మాట్లాడటం దయ్యాలు వేదాలు వల్లించటమే.

అబద్ధ ప్రచారాలతో ఎన్నికట్టు కథలల్లినా వాస్తవాలను దాచిపెట్టలేక పోతున్నారు. సిరియా పాలకుడు అస్సాద్‌కు మద్దతుగా రాజధాని డమాస్కస్ లోనూ ఇతర పట్టణాలలోను ప్రజలు పెద్ద ఎత్తున ప్రదర్శనలు చేస్తున్నారు. అస్సాద్ ప్రభుత్వాన్ని తొలగించాలంటూ ప్రచారం చేస్తున్న అమెరికా పత్రిక న్యూయార్క్ టైమ్స్ "మెజారిటీ ప్రజలు అస్సాద్‌కే మద్దతు తెలుపుతున్నారని డమాస్కస్‌లోని సబాబహ్‌రాత్ స్క్వేర్‌లో సాగిన ప్రజాప్రదర్శన తెలుపుతున్నది. ప్రజావెల్లువ వచ్చిన ఏడునెలల తర్వాత పరిస్థితి ఇది" (13-1-2012) అనిపేర్కొంది.

కతార్‌లో సిరియాకు వ్యతిరేకంగా ఒక ఫౌండేషన్ ఏర్పడింది. దాని పేరు దోహ డిబేట్స్. "ఇటీవలి ప్రజాభిప్రాయ సేకరణలో అస్సాద్ రాజీనామా చేయరాదని 55 శాతం మంది అభిప్రాయపడ్డార"ని అది తెలిపింది (2-1-2012)

సిరియాలోని ప్రతిపక్షాలన్నీ నేషనల్ కో ఆర్డినేషన్ కమిటీగా ఏర్పడ్డాయి. ఆ కమిటీ నాయకుడు హసన్ అబ్దుల్ హజీం ఇలా ప్రకటించాడు : "మా దేశ స్వాతంత్ర్యానికి ప్రమాదకారైన విదేశీ సైనిక జోక్యాన్ని మేము సూత్ర రీత్యా నిరాకరిస్తున్నాము" (19-1-2012)

అయితే సిరియా దేశానికి బయటవున్న ప్రతిపక్షమనేది (దానిపేరు సిరియన్ నేషనల్ కౌన్సిల్) అమెరికా ఏర్పాటు చేసిందే. దాని నాయకులు వాషింగ్‌టన్‌కూ సాదీ అరేబియా రాజధానీ జెడ్డాకు మధ్య విమానాలలో తిరుగుతుంటారు. వీరు మాత్రం సిరియాను 'విముక్తి' చేసేందుకు సైనిక జోక్యం చేసుకోమని అమెరికాను కోరుకుంటారు. అస్సాద్‌కే మెజారిటీ మద్దతుందన్న వార్తకు ఇలాంటి విజ్ఞప్తితోనే న్యూయార్క్ టైమ్స్ ముగింపునిచ్చింది.

సిరియా ప్రజలు విదేశీ సైనిక "సహాయాన్ని" కోరుకోవటం లేదు అని స్పష్టంగా తెలుస్తూనే వుంది. తమ పాలకుడు నిరంకుశుడైతే తామే పోరాడి తొలగించుకుంటామనీ, ట్యూనీసియా, ఈజిప్టులలో జరిగిందదేనని వారు తమ ప్రదర్శనలతో స్పష్టం చేశారు.

ప్రజల వెల్లువను తనకనుకూల ప్రభుత్వాన్ని నెలకొల్పే విధంగా మలిచేందుకు అమెరికా చేస్తున్న ప్రయత్నాలే మరోదురాక్రమణకు సన్నాహాలుగావున్నాయి. అమెరికా సామ్రాజ్యవాదం సాగిస్తున్న చర్యలు మరోమారణహోమాన్ని రగిలిస్తాయి. అమెరికా యొక్క ఈ దురాక్రమణ యుద్ధ సన్నాహాలను ప్రపంచ ప్రజలు ముక్త కంఠంతో ఖండించాలి! D

## ప్రపంచ వ్యాపిత...

(4వ పేజీ నుండి)

నవంబర్ 27వ తేదీన వారి ఆందోళన విరమించే వరకు వారి ఆక్రమణలోనే ఉంచుకున్నారు. నవంబర్ 28వ తేదీన వేతన చెల్లింపులు జరుగుతాయనే హామీ పొందిన తర్వాతనే వారు ఆందోళనను విరమించారు.

డిసెంబరు 5వ తేదీన మెక్సికోలోని చిల్పాన్సింగో గురేరో పబ్లిక్ డీసెంట్రలైజ్‌డ్ రేడియో, టీవీలో పనిచేసే 300 మంది ఉద్యోగులు 5 రేడియోస్టేషన్లను, ఒక టీవీ ఛానెల్‌ను ఆక్రమించుకున్నారు. జనరల్ డైరెక్టర్‌ను గవర్నర్ తొలగించి తీరాలని, తమ వేతనాలు, ఇతర సౌకర్యాలకు సంబంధించిన డిమాండ్‌లను వారు ముందుంచారు.

2011 డిసెంబరు మొదటివారంలో కెనడాలోని మేరీస్టోన్‌కు చెందిన ఓషన్ ఛాయిస్ ఇంటర్ నేషనల్ ఉద్యోగులు చేపల ప్రాసెసింగ్ ప్లాంట్‌ను ఆక్రమించి, దిగ్బంధించారు. ఒకపద్ధతి ప్రకారం సాగిస్తున్న ఈపరిశ్రమ మూసివేతను కార్మికులు తీవ్రంగా వ్యతిరేకించారు.

### ఉద్యోగుల/కార్మికుల ఆందోళనలు-పోలీసుల అణచివేత

నవంబర్ మొదటివారంలో ఛత్తీస్‌ఘడ్‌లో సమ్మె చేస్తున్న 2000 మంది కాంట్రాక్టు ఉపాధ్యాయులను 'ఎస్మా' క్రింద అరెస్టు చేశారు. 2వ వారంలో దీనిని నిరసిస్తూ రాయచూర్ వచ్చిన వేయి మంది ఉపాధ్యాయులనూ ప్రభుత్వం అరెస్టు చేసింది.

నవంబర్ 4వ తేదీన-ఆంధ్రప్రదేశ్ పైడిభీమవరం లోని డా॥ రెడ్డీస్ ల్యాబ్ బయట ఆందోళన చేస్తున్న కార్మికులపై పోలీసులు లాఠీఛార్జీ చేశారు-భాష్పవాయువు ప్రయోగించారు. ఈ దాడిలో పలువురు కార్మికులతో పాటు ఒక పత్రికావిలేఖరి కూడా గాయపడ్డాడు. ఆగస్టు 13 నుండి సమ్మె చేస్తున్న 650 మంది డిఆర్ఎల్ కాంట్రాక్టు కార్మికులకు మద్దతుగా 25 పరిశ్రమలకు చెందిన 10 వేలమంది కార్మికులు ఈ ఆందోళనలో పాల్గొన్నారు.

నవంబర్ 9వ తేదీన-కొలంబో నగరాలైన కార్టగెనా, బరాంసాచెర్మాజాలలో పోలీసులతో జరిగిన ఘర్షణలలో 32 మంది కార్మికులు గాయపడ్డారు. ఆయిల్ పరిశ్రమ దిగ్గజం ఎస్‌పెట్రో చమురు శుద్ధి పరిశ్రమలలో సామూహికంగా బేరసారాలాడటానికి, సంఘటితమవటానికి వుండే కార్మికుల హక్కులకు మద్దతుగా దేశ వ్యాపితంగా 22 వేల మంది వంట నూనెల కర్మాగారాల కార్మికులు ఈ నిరసనల్లో పాలుపంచుకున్నారు.

2011 డిసెంబరు మొదటివారంలో షాంగైలోని సింగపూర్‌కు చెందిన హై.పి ఇంటర్నేషనల్ పరిశ్రమ కార్మికులు వెయ్యిమంది చేపట్టిన సమ్మెపై పోలీసులు విరుచుకుపడి విచక్షణా రహితంగా లాఠీఛార్జీ చేశారు. ఈ పరిశ్రమ ఒక కాంట్రాక్టు ఉత్పత్తి పరిశ్రమ. వైర్‌లెస్ టెలీ కమ్యూనికేషన్స్, కంప్యూటరింగ్, ఆటో మోటివ్ పరిశ్రమలకు, యాపిల్, బ్లాక్‌బెర్రి, మోటరోలా, హ్యూలెట్, పాకార్డ్ వంటి పరిశ్రమలకు కావలసిన విడిభాగాలను అందిస్తుంది. ఈ పరిశ్రమ యాజమాన్యం దీనిలో పనిచేసే కార్మికులను కొన్ని సార్లు రోజుకు 18 నుండి 19 గంటలు పనిచేయాలని వత్తిడి చేస్తున్నది. ఇదే పరిశ్రమ కారుచౌకగా మరో ప్రాంతంలో ఉత్పత్తిని సాగించే అవకాశమున్నపుడు తన పరిశ్రమలో ఉత్పత్తిని తగ్గించివేస్తున్నది. దీనికి నిరసనగా కార్మికులు సమ్మె చేపట్టి ప్రధాన ద్వారాలను దిగ్బంధించి పరిశ్రమను ఆక్రమించుకున్నారు.

నవంబర్ 13న ఈజిప్టులో నిరసనాందోళన సాగిస్తున్న మోబావో-అగ్రిమ్ కెనడియన్-ఈజిప్షియన్ ఎరువుల కంపెనీ కార్మికులకు-పోలీసులకు పెద్దస్థాయిలో జరిగిన సంఘర్షణలో ఇద్దరు కార్మికులు మృతి చెందగా, ముగ్గురు గాయపడ్డారు.

నవంబరు 1న ఫిలిప్పీన్స్ ఎయిర్‌లైన్స్ ఉద్యోగులు 2600మంది పిఎఎల్ సిబ్బంది తొలగింపుకు నిరసనగా ఒక ధర్నా నిర్వహిస్తుండగా పిఎఎల్‌కు చెందిన 40 మంది కిరాయి గూండాలు వారి ధర్నాపై దాడిచేశారు. ఈ దాడిలో ఒకరు చనిపోగా మరి ఆరుగురు ఆందోళనాకారులు తీవ్రంగా గాయపడ్డారు. దాడికి పాల్పడిన వారిలో ఒకరు పిఎఎల్‌కు చెందిన సెక్యూరిటీగార్డుగా గుర్తించారు.

డిసెంబర్ 13వ తేదీన-హోండూరస్‌లో ఒక జర్నలిస్టుల బృందం మరియు వారి మద్దతు దారులు కొందరు పత్రికావిలేఖరుల హత్యలను నిరసిస్తూ ప్రదర్శన నిర్వహించి దేశాధ్యక్షుని నివాసస్థలానికి చేరుకున్నారు. ఆ ప్రాంతంలో పోలీసులు, సైనికులు వారిని అడ్డుకుని, వారిపై దాడిచేశారు. ఆందోళన చేస్తున్న వారిపై లాఠీఛార్జి చేసి, భాష్పవాయువు ప్రయోగించారు. కొద్దిమంది ఆందోళనకారులు గాయపడ్డారు.

### ఇతర రూపాలలో కార్మికుల ఆందోళనలు

నవంబర్ 1న పాకిస్తాన్‌లోని ఎలక్ట్రిక్‌పవర్ కంపెనీకి చెందిన 800 మంది ఉద్యోగులు సమ్మె చేపట్టారు. వీరంతా ఫతకాలన్నింటినీ ప్రైవేటీకరించే ప్రభుత్వ విధానాలను నిరసించారు. సమ్మె సందర్భంగా కార్మికులు 126 సబ్-డివిజనల్ కార్యాలయాలను మూసివేశారు.

నవంబర్ 17న చైనాలోని తైవాన్‌కు చెందిన ఛెంగ్ షూ ఫ్యాక్టరీ ఉద్యోగులు వారి వేతనాలలో కోతను, 18 మంది మేనేజర్ల తీసివేతను నిరసిస్తూ తమ విధులను బహిష్కరించి ఫ్యాక్టరీ ద్వారం వద్ద నిరసన తెలియజేశారు. ఆందోళన చేస్తున్న కార్మికులపై కనీసం వెయ్యిమంది దాడులలో పాల్గొనే పోలీసులను, సైనికులను ప్రయోగించారు. అనేకమంది కార్మికులు ఈ దాడులలో తీవ్రంగా గాయపడ్డారు.

నవంబర్ 2వ వారం నుండి ఇండియానా-ఓలిటిక్‌లోని ఇండియానా లైమ్‌స్టోన్ కంపెనీ కార్మికులు-యాజమాన్యం వేతన ఒప్పందాన్ని తిరగదోడటాన్ని నిరసిస్తూ సమ్మె చేశారు.

డిసెంబర్ 1,2 తేదీల్లో జర్మన్ పోస్టు బ్యాంక్‌కు చెందిన 3500 మంది ఉద్యోగులు డార్ట్‌మెనల్ కొలొగ్న్, బోన్, హనోవర్ నగరాలలో సమ్మెలు, నిరసన ప్రదర్శనల్లో పాల్గొన్నారు. డచ్ బ్యాంక్ కొనుగోలు చేసిన పిదప జర్మన్‌పోర్టు బ్యాంక్ ఉద్యోగుల స్థితిగతులు తీవ్రస్థాయిలో దిగజారటాన్ని వారు ప్రముఖంగా ఎత్తిచూపారు. శలవులలో కోత, పనిగంటల పెంపుదల, వేతనాలలో కోత, ఉద్యోగాల తొలగింపులను కార్మికులు ఎదుర్కొంటున్నారు.

సీమెంట్ అండ్ వాటర్ ఫ్రంట్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ సభ్యులు డిసెంబర్ 3వ వారంలో తమ యూనియన్ అధ్యక్షుని తొలగించారు. వేతన ఒప్పంద కాలంలో యాజమాన్యంతో ఇతను కుమ్మక్కు అయ్యాడని వారు నిర్ధారించుకుని ఈ చర్య చేపట్టారు. D

## యానాం రీజన్సీ...

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా సంభవించిన కంపెనీ వైస్ ఛైర్మన్ మరణాన్ని అదనుగా తీసుకొని కంపెనీ యాజమాన్యం కార్మికులపై విషం కుమ్మరిస్తున్నది. దశాబ్దాలుగా కార్మికులపట్ల తామనుసరించిన నిరంకుశ, దోపిడీ విధానాలను కప్పిపుచ్చుకుంటూ అవాస్తవాలతో కార్మికులపై దాడిచేపట్టింది. కార్మికుల విధ్వంసంలో కంపెనీకి వందకోట్లకుపైగా నష్టంవాటిల్లిందని, కంపెనీని పునరుద్ధరించటానికి 700 కోట్లు ఖర్చవుతుందనే మోసపూరిత ప్రచారం సాగిస్తున్నది. ఫిబ్రవరి 1వ తేదీన కంపెనీని లాకౌట్ చేస్తున్నట్లుగా ప్రకటించింది. 'మృదుస్వభావి' అయిన తమ కంపెనీ వైస్ ఛైర్మన్‌ను కార్మికులు హత్యచేశారని ప్రచారసాధనాల ద్వారా పెద్ద గొంతుతో గగ్గోలు పెడ్తున్న యాజమాన్యం, కార్మిక నాయకుడు మురళీమోహన్ పోలీసు దెబ్బలకు మృతిచెందలేదని గుండెపోటు కారణంగా మృతి చెందాడని తీర్పులిస్తూ తన దోపిడీ వర్గస్వభావాన్ని మరోమారు వెల్లడి చేసుకుంది. కార్మికులపట్ల తాను సాగించిన ఘాతుకాన్ని మరుగుపరుస్తూనే, వారు సాగించిన విధ్వంసం పేరుతో ఒకటికి నాలుగు రెట్లు అదనంగా (బీమా రూపంలో) దండుకోజూస్తున్నది. ఈ నేపథ్యంలో ప్రజలు, ప్రజాతంత్రవాదులంతా కార్మికుల న్యాయమైన వుద్యమానికి సంఘీభావంగా నిలవాలి. కార్మికుల ఈ సమస్యలను తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేయాలి.

- రీజన్సీ కంపెనీ కార్మికులపై పోలీసు కాల్పులకు, కార్మిక నాయకుడు మృతికి కారకులైన యాజమాన్యం, పోలీసు అధికార్లను కఠినంగా శిక్షించాలి.
- కార్మికుల బకాయిలన్నింటిని యాజమాన్యం తక్షణమే చెల్లించాలి.
- మృతి చెందిన కార్మిక నాయకుని కుటుంబానికి, కాల్పులలో గాయపడిన వారందరికీ పరిహారం చెల్లించాలి.
- కంపెనీ కార్యకలాపాలను వెంటనే పునరుద్ధరించాలి. లాకౌట్‌తో నిమిత్తం లేకుండా ఈ మొత్తం కాలానికి కార్మికులకు వేతనాలు చెల్లించాలి.
- కార్మికులపై బనాయించిన కేసులన్నిటినీ వెంటనే ఎత్తివేయాలి. వేధింపులు ఆపాలి.

D

# కార్మికవర్గ రాజకీయ దృక్పథం ప్రాతిపదికగా పోరాడనిదే బడాపెట్టుబడివర్గదాడులను ఎదుర్కొనలేమని తెలియచెపుతున్న

# మారుతి సుజుకి మానెసర్ ప్లాంట్ కార్మికుల అనుభవం

**సంయుక్త** పెట్టుబడిలో 26% వాటాతో మూడు దశాబ్దాలక్రితం మన దేశంలో ప్రవేశించిన మారుతి-సుజుకి కంపెనీ 54.2% వాటాలను సాధించి ఆ పరిశ్రమను పూర్తిగా తనస్వాధీనంలోనికి తెచ్చుకుంది. కార్మికుల శ్రమను నిర్దాక్షిణ్యంగా దోచుకుంటూ గణనీయమైన లాభాలనార్జించి దేశంలోనే అతిపెద్ద వాహన పరిశ్రమగా అవతరించింది. సుజుకి కంపెనీకి భారతదేశంలో అనుబంధ సంస్థ అయిన మారుతి-సుజుకి నేడు ఆ కంపెనీకున్న అనుబంధ సంస్థలన్నిటిలోను అత్యధిక లాభాలను సంపాదించి పెడుతున్నది. 2010-11 సంవత్సరంలో సుజుకి మోటార్ కార్పొరేషన్ విదేశీ అమ్మకాలలో (జపాన్‌దేశం వెలుపల) మారుతి-సుజుకి వాటా 62% కాగా ఆ కంపెనీ మొత్తం అమ్మకాలలో మారుతి-సుజుకి వాటా 48%. ఆ విధంగా జపాన్‌కు చెందిన బహుళజాతి సంస్థ అయిన సుజుకి మోటార్ కార్పొరేషన్ భారతదేశంనుండి విపరీతమైన ప్రయోజనాలను పొందుతున్నది. ప్రపంచ వ్యాప్తంగా ఆ కంపెనీ లావాదేవీలలో 55% మారుతి-సుజుకి ద్వారానే జరుగుతున్నాయి. భారతదేశంలోని కార్మికుల అధిక ఉత్పాదక సామర్థ్యం వలననే ఈ అభివృద్ధి సాధ్యమయింది.

సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలను అమలు చేస్తున్న భారత పాలకులు, దేశంలోని కార్మిక చట్టాలను ప్రక్కనపెట్టి విదేశీ బడా పెట్టుబడి నిర్దాక్షిణ్యంగా కార్మికులను దోచుకొని విపరీత లాభాలను గడించటానికి అవకాశాలను సృష్టించారు. ఈ వాతావరణాన్ని తెలివిగా ఉపయోగించుకున్న మారుతి-సుజుకి యాజమాన్యం కార్మికులపై విపరీత పనిభారాన్ని మోపింది. ఉత్పత్తి పెంచుకోవటానికి అక్రమమైన కార్మిక విధానాలను అవలంబించింది. హర్యానాలోని మానెసర్ ప్లాంట్‌లో కాంట్రాక్టు కార్మికులచేత విపరీతమైన శ్రమ చేయించారు. మానెసర్ ప్లాంట్ ఉన్నతస్థాయిలో యాంత్రీకరణ చేయబడినది. ఇదే సమయంలో అక్కడపని చేసే కార్మికులలో అత్యధికులు కాంట్రాక్టు కార్మికులు లేదా శిక్షణ పొందే విద్యార్థులు. అక్కడ 1100 మంది కాంట్రాక్టు కార్మికులు, 400 మంది శిక్షణ పొందేవారు, 400 మంది అప్రెంటీస్‌లు ఉండగా శాశ్వత ఉద్యోగులు కేవలం 950 మందే ఉన్నారు. కాంట్రాక్టు కార్మికులు, శిక్షణపొందేవారు, అప్రెంటీస్‌లు కూడా శాశ్వత ఉద్యోగులతో సమానంగా పనిచేయాలి. అన్ని కార్మిక చట్టాలకు విరుద్ధంగా బలవంతంగా పని చేయిస్తున్నారు. అనైతిక పనిపద్ధతులతో మారుతి-సుజుకి కంపెనీ తన మానెసర్ ప్లాంట్‌లో ఉత్పత్తిని ఏడాదికి 2,50,000 కార్ల నుండి 3,50,000కు పెంచుకున్నది. ఉత్పత్తిలో వృద్ధి గురుగావ్‌లో 17% ఉండగా మానెసర్‌లో 40% ఉంది. రోజుకు రెండుసార్లు ఇచ్చే టీ విరామ సమయాన్ని కూడా 15 నిమిషాల నుంచి $7^{1}/_{2}$ నిమిషాలకు తగ్గించారు. భోజన విరామసమయాన్ని 60 నిమిషాలనుంచి 30 నిమిషాలకు తగ్గించారు. కార్మికులు తమ పని ప్రదేశంనుంచి ఒక్క నిమిషం కూడా బయటకు వెళ్ళటానికి వీలులేదు. కాలకృత్యాలు తీర్చుకోవడానికి అదనంగా అనుమతి కూడా ఇవ్వరు. కార్మికులు ఒక నిముషం ఆలస్యంగా వస్తే ఒకపూట వేతనాన్ని తగ్గిస్తారు. ఈ పనికి ఒక రోజు రాకపోయినా వేతనంలో కోత ఎక్కువగా ఉంటుంది. అసెంబ్లీలైన్లు కదిలేవేగాన్ని పెంచటంతో కార్మికులు ఒక్కొక్క కారు మీద వెచ్చించే సమయం తగ్గిపోతున్నది. దానితో తప్పులు ఎక్కువగా జరుగుతున్నాయి. ప్రతిపొరపాటును లెక్కించి దానిని వ్రాసి సంబంధిత కార్మికునిచే సంతకం చేయిస్తారు. పని జరుగుతున్న సమయములో ఉత్పత్తి లక్ష్యాలకు సంబంధించి ఆ పూట కోల్పోయిన సమయాన్ని గురించి, ఆపూట పనిలో వచ్చిన తేడాను గురించి విద్యుత్ వెలుగుల తెరలపై అక్షరాలు పరుగెడుతుంటాయి. లైట్లు, హెచ్చరిక సంకేతాలు నిరంతరం ప్రసారమవుతూ కార్మికులను ఒత్తిడికి గురిచేస్తూ మానసిక ప్రశాంతి లేకుండా చేస్తుంటాయి. ఆ విధంగా కార్మికులను సజీవమైన మనుష్యులుగాకాక మర బొమ్మలలా చూడటం జరుగుతోంది.

ఇంత మానసిక, శారీరక శ్రమ చేస్తూ లక్ష్యాలను పూర్తి చేస్తున్న కార్మికులకు ఇచ్చే వేతనం మాత్రం చాల తక్కువగా ఉంటున్నది. శాశ్వత కార్మికులకు నెలసరి జీతం రు. 16,000/- కాగా నైపుణ్యం కలిగిన కాంట్రాక్టు కార్మికులకు 7,200/- నైపుణ్యం లేని కాంట్రాక్టు కార్మికులకు 5,200/- శిక్షణపొందేవారికి 4,000/- ఇస్తున్నారు. కాంట్రాక్టు కార్మికులకు నేరుగా యాజమాన్యం జీతాలివ్వదు. వారిని సరఫరా చేసే కాంట్రాక్టరు ద్వారా చెల్లిస్తుంది. కాంట్రాక్టరు కొంత కమీషన్ మినహాయించుకొని మిగిలినదానిని కార్మికులకు ఇస్తాడు. కానీ కాంట్రాక్టు కార్మికులు, అప్రెంటీసులు, శిక్షణపొందేవారు అందరూ రెగ్యులర్ కార్మికులతో సమానంగా పని చేయాలి. మానెసర్ ప్లాంట్‌లో కార్మిక సంఘంలేదు. గుర్‌గావ్ ప్లాంట్‌లోని కార్మికసంఘమే మానెసర్ కార్మికుల వ్యవహారాలను కూడా చూస్తుంది. గుర్‌గావ్ కార్మిక సంఘం యాజమాన్యానికి అనుకూలంగా ఉంటుంది. ఆ సంఘంలో మానెసర్‌ప్లాంట్ ప్రతినిధులెవరూలేరు. కానీ యాజమాన్యం గుర్‌గావ్ సంఘాన్నే గుర్తించింది.

1) తక్కువ వేతనాలతో చట్టవిరుద్ధంగా కాంట్రాక్టు కార్మిక వ్యవస్థను కొనసాగించటం. 2) పనిప్రదేశాలలోని క్రూరమైన స్థితిగతులు 3) నిరంతరం పెరుగుతున్న పని భారం, మానసిక ఒత్తిడి, పని ప్రదేశంలో స్వేచ్ఛ లేకపోవడం 4) స్వంత కార్మిక సంఘం లేకపోవడం వంటి కారణాలవలన మానెసర్ ప్లాంట్ కార్మికులు సంఘటితమై స్వంతయూనియన్‌ను స్థాపించుకొని దానిని రిజిష్టర్ చేయించేందుకు పూనుకున్నారు. అమానవీయ పనిపరిస్థితుల కారణంగా ఏర్పడిన అనివార్య పరిణామం ఇది. ఈ కారణాలు కార్మికులలో అశాంతికి వారి ఆందోళనకు దారితీసాయి. మారుతి-సుజుకి యాజమాన్యానికి ఈ సహజమైన అనివార్యమైన చైతన్యం 'రాజకీయం'గా కనబడింది. రాజకీయం అనిముద్రవేసి అప్పుడే మొలకెత్తుతున్న కార్మికుల వర్గచైతన్యాన్ని అణచివేయ పూనుకున్నారు. ఈ 'రాజకీయం' ముద్రమాటున అమానవీయమైన, క్రూరమైన దోపిడీని వెట్టిచాకిరిలాగా కొనసాగిస్తూ తమ దోపిడీవర్గ రాజకీయాలను కొనసాగిస్తున్నారు.

తమ కార్మిక సంఘాన్ని రిజిష్టర్ చేసుకోవటం కోసం మానెసర్ ప్లాంట్ కార్మికులు హర్యానా కార్మిక శాఖకు ఒక దరఖాస్తు చేసుకున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న యాజమాన్యం కంపెనీ అధికారులచేత ఒత్తిడి చేయించి 'మేము గురుగావ్ సంఘంలో సంతోషంగా ఉన్నాము, కొత్తది ప్రారంభించము' అనే అఫిడవిట్ మీద కార్మికుల సంతకాలు తీసుకున్నారు. యాజమాన్యం చేపట్టిన ఈ చర్య కార్మికులను మరింత రెచ్చగొట్టింది. 2011 జూన్ 4న సమ్మె చేసి నిరసన తెలియచేయాలనే చర్యకు దారితీసింది.

మారుతి-సుజుకి ఉద్యోగ సంఘాన్ని రిజిష్టర్ చేయించటానికి కార్మికులు దరఖాస్తు చేసే ముందురోజు క్రమశిక్షణ రాహిత్యంతో వ్యవహరిస్తున్నారని 11 మంది కార్మికులను యాజమాన్యం పనిలోనుండి తొలగించింది. ప్రతిపాదిత కార్మిక సంఘంలోని నలుగురు ఆఫీసుబేరర్లు తొలగింపబడిన వారిలో ఉన్నారు. జులై 6 వరకు సమ్మె కొనసాగింది.

కార్మికులకు-యాజమాన్యానికి మధ్య కుదిరిన ఒప్పందం ఎక్కువకాలం కొనసాగలేదు. తమ మాట వినకుండా కొత్త యూనియన్ స్థాపించారనే అక్కసుతో యాజమాన్యం కక్ష సాధింపు చర్యలు చేపట్టడం ప్రారంభించి కార్మికులపై తప్పుడు ఆరోపణలు చెయ్యటం మొదలెట్టింది. తిరిగి నియమింపబడిన 11 మంది కార్మికులు, పనిప్రదేశాలలోని నియమాలను పాటించటం లేదని, తోటి కార్మికులను సూపర్‌వైజర్లపైకి, అధికారుల పైకి, యాజమాన్యంపైకి రెచ్చగొడుతున్నారనే ఆరోపణలు చేసింది. ఇటువంటి తప్పుడు ఆరోపణలతో కార్మికులకు 'అభియోగ పత్రాలు' జారీచేసి వారి వేతనాలలో ఏకపక్షంగా కోత విధించింది. కార్మికులు నెమ్మదిగా పనిచేయాలనే (వర్కుస్లో) వ్యూహాన్ని పన్నారని ప్రచారం ప్రారంభించింది. ఇటువంటి తప్పుడు నేపథ్యంతో అగస్టు 29న యాజమాన్యం లాకవుట్ ప్రకటించింది. లాకౌట్ ఎత్తివేయాలంటే 'సత్‌ప్రవర్తన పత్రం'పై సంతకం చేయాలని ఒత్తిడి చేసింది. ఉత్పత్తిని దెబ్బతీస్తున్నారని, కావాలని నాణ్యతా సమస్యలు సృష్టిస్తున్నారని ఆరోపిస్తూ 18 మంది ట్రయినీలను, 44 మంది శాశ్వత ఉద్యోగులను పని నుండి తొలగించింది. తన అనైతిక విధానాలను కప్పిపుచ్చుకోవటానికి వీరిని క్రమశిక్షణ లేని చెడ్డవారిగా యాజమాన్యం ముద్రవేసింది. అటువంటి అక్రమ పత్రంపైన సంతకం చేయుటకు కార్మికులు సహజంగానే నిరాకరించారు. నిరసనగా సమ్మె చేయటానికే వారు నిర్ణయించుకున్నారు. మరోవైపున యాజమాన్యం క్రొత్తగా కాంట్రాక్టు కార్మికులను నియమించుకొని, సత్ప్రవర్తనా పత్రాలపై సంతకం చేసిన వారితోను, కొందరు సూపర్‌వైజర్లతోను పని ప్రారంభించింది. ఈ వివాదాన్ని పరిష్కరించటంలో యాజమాన్యం మొండివైఖరిని ప్రదర్శించింది. భారతదేశంలోనే కాదు, జపాన్‌లోనే కాదు ఎక్కడైనా క్రమశిక్షణ రాహిత్యాన్ని సహించలేక పోవటమనేది మా కంపెనీ సంస్కృతి అని యాజమాన్యం ప్రకటించింది. అందువలన సమ్మె 33 రోజులపాటు సాగి యాజమాన్యంతో ఒప్పందం జరిగిన తర్వాత ముగిసింది. కార్మికులు సత్‌ప్రవర్తనా పత్రంపై సంతకాలు చేయాలని, తొలగించిన 18 మంది శిక్షణపొందే వారిని తిరిగి నియమించాలని, 44 మంది శాశ్వత ఉద్యోగులను సస్పెన్షన్‌గా పరిగణించాలని ఒప్పందంలో పేర్కొన్నారు.

అక్టోబర్ 3న కార్మికులు విధులలో చేరటం ప్రారంభించారు. కాని యాజమాన్యం 170 మందిని మాత్రమే కాంట్రాక్టు కార్మికులుగా తీసుకొని మిగిలిన వారిని దశలవారీగా తీసుకుంటామని చెప్పారు. యాజమాన్యం వ్యవహరిస్తున్న తీరు అక్టోబర్1న కుదిరిన ఒప్పందాన్ని ఉల్లంఘించటమేనని, సమ్మెలో భాగస్వాములైన కార్మికులపై కక్షసాధింపు చర్యలో భాగంగానే వారు చేస్తున్నారని కార్మికులు భావిస్తున్నారు. 1100మంది కాంట్రాక్టు కార్మికులను, సస్పెన్షలో ఉన్న 44 మంది శాశ్వత కార్మికులను పనిలోనికి తీసుకోవాలని డిమాండు చేస్తూ కార్మికులు సమ్మెలోనికి దిగారు.

హర్యానా ప్రభుత్వం యాజమాన్యానికి అనుకూలంగా సమ్మెను చట్టవిరుద్ధంగా ప్రకటించింది. అక్టోబర్ 1 ఒప్పందాన్ని కార్మికులు ఉల్లంఘించారని ప్రభుత్వం ఆరోపించింది. అంతేకాక పోలీసులు కర్మాగారానికి రక్షణ కల్పించారు. యాజమాన్యం కర్మాగారం చుట్టూ కంచె నిర్మించి కార్మికులు ప్రవేశించకుండా నిరోధించారు. మానెసర్ ప్లాంట్‌కు 100 మీటర్ల పరిధిలోనికి కార్మికులు ప్రవేశించకుండా న్యాయస్థానాలనుండి ఉత్తర్వులను తెచ్చింది. అక్టోబర్ 7న ఒప్పందాన్ని ఉల్లంఘించారని ఆరోపిస్తూ ప్రభుత్వం కార్మికులకు నోటీసు జారీ చేసింది. మరోవైపున యాజమాన్యం ఉద్యమిస్తున్న కార్మికులపై దుష్ప్రచారాన్ని సాగిస్తున్నది. కార్మికులకు సానుభూతి పరులైన విలేకరులపైనకూడా ఈప్రచార ప్రభావం పడింది. మారుతి-సుజుకి యాజమాన్యం చేసిన తప్పుడు ఆరోపణలన్నింటినీ కార్పోరేట్ మీడియా విధేయతతో ప్రచురించింది.

83,000 వాహనాల ఉత్పత్తి నష్టం కలిగిన తరువాత మారుతి-సుజుకి యాజమాన్యము, యాజమాన్యపు దాడులను తట్టుకోలేని కార్మికులూ ఎట్టకేలకు అక్టోబర్ 14న ఒక ఒప్పందానికి వచ్చారు. ఫలితంగా అక్టోబర్ 14న సమ్మె ముగిసింది. హర్యానా రాష్ట్ర ప్రభుత్వం కూడా భాగస్వామి అయిన ఈ ఒప్పందంలో కార్మికులు 'సత్ప్రవర్తన పత్రం'పై సంతకం చేయాలని నిబంధన ఉంది. ఈ మొత్తం ఉదంతానికి విషాదమేమంటే 28-11-2011న కేంద్ర కార్మిక శాఖ మంత్రి ఎం.ఖర్గే లోక్‌సభలో ఈ విధంగా ప్రకటించారు "కార్మికులను తిరిగి పనిలోనికి అనుమతించడానికి సత్ప్రవర్తనా పత్రాలపై సంతకాలు చేయాలని డిమాండు చేయడం ఏకపక్ష చర్య అనీ, ఇవి అనైతిక కార్మిక విధానాలకు దారితీస్తుంద"ని!

మానెసర్ ప్లాంట్‌లోని కార్మికులు ఏర్పాటు చేసుకున్న కొత్త సంఘం పూర్తి రాజకీయ రహితమైనదనీ, నాయకులు స్వంతంగా తమ శక్తి సామర్థ్యాలతో నడుపుతున్నారనీ, కార్మికుల హక్కులను రక్షించటానికి వారిని సంఘటిత పరుస్తున్నారనీ మీడియా విస్తృతంగా ప్రచారం చేయటాన్ని మనం గమనించాలి. ఈ కార్మిక నాయకులను జార్జిఫెర్నాండెజ్, దత్తాసామంత్, శంకర్‌గుహనియోగిల స్థాయికి సమానం చేస్తూ ఆకాశానికెత్తడం జరిగింది.

కొత్తగా ఏర్పాటైన యూనియన్ అధ్యక్షుడు సోను గుజ్జర్, ప్రధాన కార్యదర్శి శివకుమార్ చెరి 16 లక్షల రూపాయలు పరిహారం తీసుకుని అక్టోబర్ 19నే అంటే ఒప్పందం కుదరటానికి ముందే రాజీనామా చేసారని సమ్మె/లాకౌట్ ముగిసిన పదిరోజుల తర్వాత బయటపడింది. మిగిలిన 28 మంది సస్పెండయిన కార్మికులకు కూడా యాజమాన్యం ఇవ్వజూపిన దానితో సంతృప్తి చెంది రాజీనామా చేయడం మినహా మరోదారిలేకుండా పోయింది.

ఈ విషయాలన్నీ బయటపడిన తరువాత సోనుగుజ్జర్ మానెసర్ ప్లాంట్ కార్మికులకు ద్రోహం చేశాడని మీడియా నిందించటం ప్రారంభించింది. అంతేకాక సోనుగుజ్జర్, శివకుమార్‌లు చెరొక కోటిరూపాయలు యాజమాన్యం దగ్గరనుంచి తీసుకున్నారని, వీరిరువురికీ న్యూఢిల్లీలో చెరొక ఇల్లు, చెరొక కారు యాజమాన్యం సమకూరుస్తుందని మీడియా పుకార్లు వ్యాపింపచేసింది.

మానెసర్ ప్లాంట్‌లోని కీలక నాయకుడైన సోనుగుజ్జర్ ఈ విధంగా చెప్పారు : వేము విజయవంతమైన సమ్మెకు నాయకత్వం వహించాము. యాజమాన్యం మా డిమాండ్లు అనేకం అంగీకరించింది. కార్మికులను తిరిగి పనిలోనికి తీసుకోవాలన్న మా ప్రధాన డిమాండును అంగీకరించింది. కాంట్రాక్టు కార్మికులను తిరిగి తీసుకోవడానికి కూడా అంగీకరించింది. ఈ విజయం కొరకు నేను నాతోటి 19 మంది కార్మికులు త్యాగం చేశాము. మారుతి కంపెనీ నుండి బయటకు వచ్చాము. దానికి బదులుగా కంపెనీ మాకు డబ్బు ఇచ్చింది. ఇది పూర్తిగా సక్రమమే. ఆ డబ్బు తీసుకోవటానికి మేము అర్హులమే. నేను, నాతోటి కార్మికులు కంపెనీతో ఒప్పందానికి సంతకం చేయటమే కాక, విచారణ నివేదిక ఏది వచ్చినా అంగీకరించి నందుకుగాను ఆర్థిక సహాయం ఇచ్చారు. మేం కంపెనీలో తిరిగి నియమింపబడే అవకాశంలేదు. వాస్తవమేమంటే విచారణ మా పక్షాన ముందు అనుకూలంగా జరిగే అవకాశమేలేదు. కుటుంబ ఒత్తిళ్ళు కూడా మామీద ఉన్నాయి. అంతేకాక మారుతీ కంపెనీ మానెసర్ నుంచి ఈ ప్లాంటును వేరొక చోటికి తరలించే అవకాశం కూడా ఉంది. అది జరిగితే చాలా మంది ఉపాధిని కోల్పోతారు. అలాగే కార్మికులపై కూడా గ్రామాలనుంచి ఒత్తిడి ఉంది. మా పొరుగు గ్రామాల ప్రజలు సమ్మె ముగించమని పదేపదే కోరుతున్నారు. డబ్బు ఇవ్వడం కార్మికుల సమస్యలను పరిష్కరించదు. కాని సమ్మెలో పాల్గొని తమ జీతాలను, ఉద్యోగాలను గందరగోళంలోనికి నెట్టుకున్న వారికి ఆర్థిక భద్రత కూడా ముఖ్యమైనదే.

సోనుగుజ్జర్ యొక్క ఈ ప్రకటన దేశంలోని కార్మిక ఉద్యమంయొక్క దయనీయ స్థితిని తెలియచేస్తోంది.

ఈ ప్రకటనతో మనం సోనుగుజ్జర్ యొక్క నిజాయితీని అనుమానించలేం. మానెసర్ ప్లాంట్ కార్మికులకు అతను ద్రోహం చేశాడనే నిర్ణయానికి కూడా రాలేము. కార్మిక నాయకుడుగా అతను యాజమాన్యం నుంచి పలురకాల దాడులను ఎదుర్కొన్నాడు. ప్రభుత్వం వైపు నుంచికూడా దాడులను ఎదుర్కొనవలసి వచ్చింది. బడాపెట్టుబడి దారుడు, బలవంతుడు అయిన ప్రత్యర్థితో ప్రతికూల పరిస్థితులలో అతను పోరాడవలసి వచ్చింది.

భారతదేశంలోని కార్మికుల సమస్యలకు, ప్రత్యేకంగా మానెసర్ ప్లాంట్ కార్మికుల సమస్యలకు మూల కారణాలను, వాటి తీవ్రతను అర్థంచేసుకోవటంలో అతనికున్న వెనుకబాటుతనానికి మనం జాలిపడటం తప్ప ఇంకేం చెయ్యలేం. ఈ సమస్యలలో ఇమిడియున్న వర్గ స్వభావాన్ని అతను అర్థంచేసుకోలేకపోయాడు. పాలకవర్గాలు ప్రచారం చేస్తున్న నైతికత, విలువలు అనే ఆదర్శవాద భావజాలంతో అతను కార్మిక సంఘాన్ని నడపాలనుకున్నాడు. అతను అర్థం చేసుకోలేకపోయాడు. అతను కార్మికులకు మంచి సంస్కరణవాదనాయకుడు. కానీ పాలకవర్గ భావజాలానికి బలిఅయిన వ్యక్తి. పాలకవర్గమూ, ప్రభుత్వమూ కార్మిక సంఘాలు రాజకీయ రహితంగా ఉండాలని కోరుకుంటూండగా మన దేశంలోని కార్మికులు ముఖ్యంగా మానెసర్ ప్లాంట్ కార్మికులు కేంద్ర కార్మిక సంఘాల నాయకత్వంలో పని జేయాటానికి ఇష్టపడటంలేదు. కేంద్ర కార్మిక సంఘాలు వామపక్ష సంఘాలైనా, ఇతర సంఘాలైనా గత దశాబ్దాలలో వాటి ఆచరణద్వారా అవి కార్మికుల విశ్వాసాన్ని చూరగొనలేక పోయాయి. అందువలననే మానెసర్ ప్లాంట్ కార్మికులు స్వతంత్ర సంఘం ఏర్పాటు చేసుకోవాలనుకున్నారు. యాజమాన్యము, ప్రభుత్వాలు ఇస్తున్న రాజకీయరహిత సంఘం అన్ననినాదం యొక్క మోసాన్ని వారు అర్థం చేసుకోలేకపోయారు. ఆ నినాదమే నిజానికి వర్గ స్వభావం కలిగిన నినాదమనీ, వర్గ ప్రాతిపదికన కార్మికులు సంఘటిత పడకుండా ఉండటానికే ఆ నినాదాన్ని యాజమాన్యం ఇస్తోందనే విషయాన్ని వారు అర్థం

**(తరువాయి 7వ పేజీలో)**

# వామపక్ష, కమ్యూనిస్టు పార్టీల సమావేశం నిర్ణయాలు

ఈ సమావేశంలో తొలుత 27వ తేదీన పోలీసుల చేతిలో హత్యకు గురైన యానాం కార్మిక నాయకుడు మురళీమోహన్‌కు జోహార్లర్పించారు.

- యానాం రీజెన్సీ సిరామిక్స్ కార్మికులపై పోలీసుల లాఠీఛార్జీ–మురళీమోహన్ మృతి, తదనంతర పరిణామాల నేపథ్యంలో, పోరాడుతున్న కార్మికులకు సంఘీభావంగా, వారిపై లాఠీఛార్జీ, దాడులను ఖండిస్తూ 11 పార్టీల నాయకులు యానాం వెళ్ళి సంఘీభావం తెల్పాలని
- రాష్ట్రంలో అంబేద్కర్ విగ్రహాల విధ్వంసాన్ని ఖండిస్తూ
- గత రెండు వారాలుగా తమ సమస్యల పరిష్కారం కోసం ఆందోళన చేస్తున్న జూనియర్ డాక్టర్లకు మద్దతునిస్తూ
- వస్త్రవ్యాపారులు తమపై రాష్ట్ర ప్రభుత్వం విధిస్తున్న వ్యాట్ పన్ను రద్దుకై నిరవధికంగా సాగిస్తున్న ఆందోళనకు మద్దతుగా
- రాష్ట్రంలో కరవు సమస్యపై వెనువెంటనే సహాయ చర్యలు చేపట్టాలని ప్రధానిని కోరుతూ
- ఫిబ్రవరి 28న సార్వత్రిక సమ్మెకు సంఘీభావంగా ఫిబ్రవరి 16న హైదరాబాద్‌లో 11 పార్టీల ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించాలని
- విద్యుత్ ఛార్జీల పెంపుదలకు వ్యతిరేకంగా ప్రజల మధ్య ప్రచారాందోళన చేపట్టాలని, ఇఆర్‌సి ముందు వాదనలు వినిపించాలని నిర్ణయించారు.

**28-1-12**
హైదరాబాద్

| | | | |
|---|---|---|---|
| సిపిఐ | సిపిఐ(ఎం) | సిపిఐ(ఎం-ఎల్) | సిపిఐ (ఎం-ఎల్) న్యూ డెమోక్రసి |
| సిపిఐ (ఎం-ఎల్) లిబరేషన్ | ఎంసిపిఐ(యు) | ఎస్‌యుసిఐ | సిపిఐ (ఎం-ఎల్)సెంట్రల్ ఆర్గనైజేషన్ జనశక్తి |
| ఎంఎల్ కమిటి | ఫార్వర్డ్‌బ్లాక్ | ఆర్ఎస్‌పి | |

**కూడంకులమ్...** (మొదటి పేజీ తరువాయి)

- కూడంకులమ్ అణువిద్యుత్ కేంద్రాన్ని వ్యతిరేకించటానికి నిజాయితీతో కూడిన, శాస్త్రీయ కారణాలు అనేకం వున్నాయి. కానీ, ప్రజల ఆందోళనకు ముఖ్యమైన కారణమేమంటే, భారత అణుఇంధన నియంత్రణ సంస్థ (ఏఇఆర్‌బి) రూపొందించిన నియమ, నిబంధనలన్నిటియొక్క మాకుమ్మడి ఉల్లంఘనగా వుండటమే!
- ఏ అణువిద్యుత్ కేంద్రాన్ని స్థాపించాలన్నా, దాని ప్రతిపాదన దశలోనే ప్రజాభిప్రాయాన్ని తప్పనిసరిగా మదింపు చేయాలి. కానీ కూడంకులం విషయంలో ప్రభుత్వం అటువంటి ప్రజాభిప్రాయసేకరణనేమీ చేపట్టలేదు.
- పర్యావరణ ప్రభావ అంచనాలను, ప్రతిపాదిత స్థల అంచనాలను, భద్రతా విశ్లేషణ నివేదికలను ప్రజలముందుంచి ప్రజలతో చర్చించాలనే ఒక నిబంధన వుంది. కానీ ఈ అధ్యయనాలు, నివేదికలేవీ కూడంకులమ్ అణుకేంద్ర ప్రారంభం నుండి ఈనాటి వరకూ ప్రజలతో చర్చించటం జరగలేదు.
- అణుకేంద్ర ప్రతిపాదిత స్థలం, భూకంపాలు సంభవించే ప్రాంతంలో వుండకూడదు. కాగా, ప్రస్తుతం కూడంకులమ్ ప్రాజెక్టు ప్రాంతంలో 2003 తర్వాత 3 ప్రకంపాలు సంభవించాయి.
- అణువిద్యుత్ కేంద్రాలలో సంభవించే ప్రమాదాలేవీ ప్రజల జీవనాధారాలకు ఎటువంటి నష్టాన్నీ కలిగించకూడదు. కానీ, కూడంకులమ్ అణువిద్యుత్ కేంద్రం నుండి వెలువడే అణుధార్మిక వ్యర్థాలకారణంగా తీరప్రాంత పర్యావరణ వ్యవస్థకు నష్టం కలగటంతో పాటు, వివిధ రకాల చేపల జాతులు, సముద్ర జీవరాసులు నాశనమవుతాయి. ఈ ప్రాంత మత్స్యకారుల జీవనాధారం నాశనమౌతుంది. ఈ విధ్వంస క్రమానికి భారత అణుశాస్త్ర వేత్తల వద్ద ప్రత్యామ్నాయం ఏమీలేదు. అయొడిన్ మరియు సీజియమ్‌ల అణుధార్మిక రేణువులు క్యాన్సర్ కారకాలుగా వుండటంతోపాటు ఈ ప్రాంత ప్రజల అంగవైకల్యాలకి కారణమౌతాయి.
- అణువిద్యుత్ కేంద్రానికి 1.6 కి.మీ. పరిధిలో నివాసాలేమీ వుండకూడదని నిబంధనలు చెబుతుండగా, కూడంకులమ్ అణువిద్యుత్ కేంద్రానికి అర్ధకిలోమీటరు పరిధిలోనే జనవాసాలు వున్నాయి. 3 కి.మీ. పరిధిలోని జనసంఖ్య 5 వేలకు ఎట్టి పరిస్థితుల్లోనూ మించరాదని నిబంధనలు చెబుతుండగా కూడంకులమ్ పరిసరాల్లో 33 వేలమంది జనాభా నివసిస్తున్నారు.
- అణువిద్యుత్ కేంద్రాలలో సంభవించే ప్రమాదాల సందర్భంగా ప్రజలను తరలించేందుకు అనుకూలంగా వుండేందుకుగానూ అణుకేంద్రానికి 30కిమీ పరిధిలో జనాభా, లక్షకు తక్కువగా ఉండితీరాలని నిబంధన చెప్తుండగా కూడంకులమ్ చుట్టుప్రక్కల ప్రాంతంలో జనాభా 30 లక్షలకుపైబడివుంది! ఏఇఆర్‌బి ప్రకారం అణువిద్యుత్ కేంద్రం ఏ నగరానికి లేదా యాత్రాస్థలాలకు సమీపానా నిర్మించరాదు. కానీ కూడంకులమ్‌కు అతిసమీపంలో నాగర్‌కోయిల్ అనే పట్టణం మరియు కన్యాకుమారి అనే మతపరమైన యాత్రాస్థలము, ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన వివేకానంద కేంద్రము వున్నాయి.
- అణువిద్యుత్ కేంద్ర ప్రారంభ దినాల్లో భారత ప్రభుత్వం రెండు యూనిట్లను నిర్మిస్తున్నట్లుగా ప్రకటించింది. తర్వాత అమెరికా సాంకేతిక పరిజ్ఞానంతో మరో నాలుగు కేంద్రాల నిర్మాణం గురించిన మరో ప్రకటన వెలువడింది. కానీ, తీర ప్రాంత నియంత్రణ మండలి (సిఆర్‌జడ్) నిబంధనల ప్రకారం పర్యావరణ మంత్రిత్వశాఖ ఈ నూతన ప్రతిపాదనలకు ఆమోదం తెలపలేదు. దీని ప్రకారం పరిశీలించినా, ప్రస్తుతం పనులు సాగుతున్న రెండు అణువిద్యుత్ కేంద్రాలుకూడా సిఆర్‌జడ్ నియమనిబంధనలనుల్లంఘించే నిర్మాణమౌతున్నాయని. తేట తెల్లమౌతున్నది.
- నూతన అణుప్రమాద బాధ్యతా బిల్లు–అణువిద్యుత్ కార్పొరేట్ రంగాన్ని, వాటి నిర్వాహకులను అణువిద్యుత్ కేంద్రాలలో సంభవించే ప్రమాదాలకు బాధ్యత వహించటం నుండి మినహాయించటాన్నిబట్టే–భారత ప్రభుత్వం అభివృద్ధి పేరుతో ప్రజల జీవితాలను, ప్రజల జీవనాన్ని ఏ విధంగా సంపూర్ణంగా నిర్లక్ష్యం చేస్తున్నదో రుజువౌతున్నది.
- తమ భవిష్యత్తు గురించి, జీవనాధారం గురించి, పర్యావరణం గురించి భయాందోళనలకు గురై నిజాయితీగా, శాంతియుతంగా నిరసనలు వ్యక్తం చేస్తున్న ప్రజలతో, ముందు చెప్పిన విధంగా రాజ్యయంత్రాంగం యొక్క అప్రజాస్వామిక వైఖరి, అణిచివేత దృష్టి మనకొక హెచ్చరిక చేస్తున్నాయి.
- కూడంకులం అణువిద్యుత్ కేంద్ర వ్యతిరేక ప్రజా ఆందోళనోద్యమానికి భారత ప్రజానీకం తమ సంఘీభావాన్నీ, మద్దతును తెలపాలని; ప్రజాస్వామిక శక్తులు కలిసికట్టుగా నిలచి ప్రభుత్వంపై వత్తిడి తేవటం ద్వారా ఈ సమస్యపట్ల మానవీయ దృష్టితో వ్యవహరించాలని; ప్రజల ప్రాణాలను, జీవనాధారాలను, పర్యావరణాన్నీ పరిరక్షించాలని మేము విజ్ఞప్తి చేస్తున్నాము.

**డిమాండ్స్:**

- కేంద్ర ప్రభుత్వం తక్షణం కూడంకులం అణువిద్యుత్ కేంద్రాన్ని మూసివేయాలి. ప్రజల జీవితాల్ని, జీవనాధారాల్ని కాపాడాలి.
- ఆందోళనకారులపైన, గ్రామస్థులపైన వివిధ సెక్షన్ల క్రింద బనాయించిన అక్రమ కేసులన్నింటినీ ఎత్తివేయాలి.
- భారతదేశంలోని సూర్యరశ్మి, గాలి, నీరు వంటి వనరులను వుపయోగించి విద్యుదుత్పత్తికి ప్రభుత్వాలు తప్పనిసరిగా ప్రత్యామ్నాయ పథకాలు రూపొందించాలి.

(2011 డిసెంబరు 5న న్యూఢిల్లీ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేఖర్ల సమావేశంలో ఈ ప్రకటన చేశారు. ఈ సమావేశంలో జస్టిస్ రాజేందర్ సచార్ (రిటైర్డ్); ఢిల్లీ హైకోర్టు మాజీ ఛీఫ్ జస్టిస్ వైకో; ఎండిఎంకె ప్రధాన కార్యదర్శి ఆర్. శ్రీధర్; 'గనులు, ఖనిజాలు మరియు ప్రజలు సంస్థ' ఛైర్‌పర్సన్ మరియు భారత ప్రభుత్వ అణుశక్తి శాఖలో బాధ్యతలు నిర్వహించిన ప్రముఖులు పాల్గొన్నారు. ఫ్రండ్స్ ఆఫ్ కూడంకులమ్ యాంటి–న్యూక్లియర్ మూవ్‌మెంట్–కన్వీనర్–ఎన్‌డిఎన్‌బౌలి; కార్యదర్శులు మాలతిమైత్రి, రాధికాకృష్ణన్ ఈ ప్రకటన విడుదల చేశారు).

(డిసెంబర్ 11, 2011 'జనత' ఆంగ్లపత్రిక నుండి సేకరించిన ప్రకటనకు ఇది తెలుగు అనువాదం –సంపాదకుడు)

D

# జైతాపూర్ అణువిద్యుత్ కేంద్ర వ్యతిరేక ఉద్యమ కార్యకర్త వైశాలీపాటిల్ తొలగింపు ఆదేశాలను వ్యతిరేకిస్తూ నిరసన

భారత గణతంత్ర దినోత్సవాలను వ్యతిరేకిస్తూ నిరసనలు జరిపే ముందుగానే, ప్రభుత్వం జైతాపూర్ అణువిద్యుత్ కేంద్ర వ్యతిరేక ఉద్యమాన్ని అణచివేయబూనుకుంది.

ముంబయికి చెందిన జనహిత్ సేవాసంఘ్–రిపబ్లిక్ దినోత్సవానికి రెండు రోజులముందుగా ఇచ్చిన 'జైల్‌భరో' పిలుపు నేపథ్యంలో జైతాపూర్ పరిసర ప్రాంతాల్లో ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసు కుంటుండగా, ఉద్యమాన్ని అణచివేసేందుకు ప్రభుత్వం ఈ నిర్బంధ చర్యలను ప్రయోగిస్తున్నది.

ఈ పరిస్థితులలో సామాజిక కార్యకర్త మరియు ప్రముఖ అణువిద్యుత్ వ్యతిరేకోద్యమ నాయకులు అయిన వైశాలీ పాటిల్‌ను ముంబయి పోలీస్ చట్టం–1951లోని 56(1) సెక్షన్ క్రింద రత్నగిరి నుండి బహిష్కరిస్తూ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. కోర్టులో పెండింగులోవున్న ప్రజాఆందోళనల సందర్భంగా పెట్టబడిన రెండు కేసులను ఉదహరిస్తూ, లాన్జా డిప్యూటీ సూపరింటెండెంట్ తుషార్ పాటిల్ 63/1012 నెం.తాఖీదుద్వారా రత్నగిరి సబ్ డివిజనల్ అధికారి ముందు హాజరవవలసిందింగా వైశాలీ పాటిల్‌ను ఆదేశించారు. వైశాలీపాటిల్ తరఫున బాచాపరులేకర్ అనే న్యాయవాది రత్నగిరి సబ్ డివిజనల్ మెజిస్ట్రేట్ ముందు హాజరయ్యారు.

గత రెండు సంవత్సరాలుగా, జైతాపూర్ ఆందోళనల నేపథ్యంలో రత్నగిరి జిల్లా కలెక్టర్ భారత నేర స్మృతిలోని సెక్షన్ 144(4) ప్రకారం సుప్రీంకోర్టు న్యాయమూర్తి పి.బి.సావంత్, కోల్సేపాటిల్, వైశాలీ పాటిల్‌లను రత్నగిరి జిల్లాలోకి ప్రవేశించనీయకుండా పదేపదే నిరోధిస్తూ వస్తున్నారు.

2011 నవంబర్ 14న 3339 నెంబరు రిట్ పిటిషన్‌ద్వారా కలెక్టర్‌యొక్క చర్యలను పిటీషన్‌దార్లు సవాల్ చేశారు. జస్టిస్ మోహిత్‌షా మరియు జస్టిస్ రోషన్ దాల్విలతో కూడిన ధర్మాసనం వారి ఉత్తర్వులలో రామమనోహర్ లోహియాకు–బీహార్ ప్రభుత్వానికి మధ్య నడచిన కేసులను ఉదహరిస్తూ రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కైన వాక్, సభా స్వాతంత్ర్యాలను పేర్కొంటూ రత్నగిరి జిల్లా కలెక్టర్ చర్యలు చట్ట విరుద్ధమైనవిగా త్రోసిపుచ్చారు.

ముంబై హైకోర్టుయొక్క ఆదేశాలు ఈ విధంగా వున్నప్పటికీ, పాలక ప్రభుత్వ ఉన్నతాధికార యంత్రాంగం ముంబయి పోలీస్ చట్టం–1951 నుపయోగించుకొని రత్నగిరి నుండి వైశాలీపాటిల్‌ను తొలగించివేసే నూతన క్రమాన్ని ప్రారంభించారు. జైతాపూర్ అణువిద్యుత్ కేంద్రానికి వ్యతిరేకంగా శాంతియుతంగా సాగుతున్న ఆందోళనను అణచి వేసేందుకు; క్రియాశీల కార్యకర్తలను, నాయకులను బెదిరించేందుకు, వేధించేందుకు ఉద్దేశ్యపూర్వకంగా చేపట్టిన చర్య యిది!

జనహిత్ సేవాసమితి అధ్యక్షులు ప్రవీణ్ గవాంకర్ ఈ చర్యలను తీవ్రంగా ఖండించారు. ఈవిధంగా 'నిరోధించే చర్యలు' దొంగలకు, గూండాలకు, హంతకులకు వ్యతిరేకంగా పరిమితమైనవికాగా, ఉద్యమ నాయకులను బెదిరించేందుకు, వాక్‌సభా స్వాతంత్ర్యాలను అణచివేసేందుకు ఈ చర్యలను ఉద్యమ కార్యకర్తలపై ప్రయోగిస్తున్నారని ఆయన అన్నారు.

ఇంతకుముందుగానే ఈ రకమైన నిరోధించే క్రమం ప్రారంభమైంది. దీనిక్రింద మదబన్ సర్పంచ్ భికాజీ వాఘ్‌మేర్, అసిస్టెంట్ సర్పంచ్ ప్రశాంత్ మంజ్రేకర్, సుహాస్ గవాంకర్, శివప్రసాద్‌గునే, నందకుమార్ రౌత్ మరియు ప్రవీణ్ గవాంకర్‌లను ఆ ప్రాంతం వెళ్ళకుండా నిరోధించారు.

'కొంకణ్ వినాశ్‌కారీ ప్రకల్ప్ విరోధి సమితి' తన వారాంతపు సమావేశంలో రత్నగిరి పోలీసుల చర్యలను ఖండించింది. రాజకీయ వత్తిడులతో వారీ చర్యలకు పాల్పడుతున్నారని పేర్కొంది.

D

# 'ఎస్‌టిఎం కంపెనీ ఆక్రమణలోని భూములు, టేకుచెట్లు ఆ ప్రాంత ఆదివాసులకే చెందాలి'

**పార్వతీపురం, 26-12-11 :**

పార్వతీపురం మండలం సంగంవల్స రెవిన్యూలో (ఎస్టీఎం) స్టీలింగ్ రీమెగ్నమ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి సుమారు 250 ఎకరముల భూములువున్నాయి. ఈ భూములన్నీ 1958లో సర్వే సెటిల్‌మెంట్‌లో గిరిజనులు సాగులోనికి తీసుకువచ్చిన భూములు. గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని సర్వేజరుగుచున్న సందర్భంలో మైదాన గ్రామాలలో నోరు గలిగిన వారు కరణం, నాయుళ్ళ సహకారముతో రికార్డుల్లో వాళ్ళ పేర్లు నమోదు చేసుకున్నారు. రికార్డులు తయారైన తరువాత ఈ భూములన్నీ ఎస్టీఎం కంపెనీకి అమ్మివేశారు. ఎస్టీఎం కంపెనీకి చెందిన యజమానులు ఇతర ప్రాంతంలోని ధనిక సెక్షన్లకు టేకుచెట్లు పెంచి భూములు యిస్తామని చెప్పి కొన్ని కోట్ల రూపాయలు దండుకున్నారు. ఆపై ఎస్టీఎం కంపెనీ బోర్డు తిప్పివేయటంతో ఎస్టీఎం కంపెనీ చరాస్తులను ఎవరికి దొరికినవి వాళ్ళు పట్టుకుపోయారు. ఈ భూములతో ఎలాంటి సంబంధంలేని కొంతమంది బడా పారిశ్రామిక వేత్తలు, కొంతమంది దళారీలు రెవిన్యూ డిపార్టుమెంటును లోబరుచుకొని ఆ భూములలోని వేలాది టేకుచెట్లు నరికి అమ్ముకోవడానికి ప్రయత్నము చేస్తున్నారు.

సంగంవల్స పంచాయితీలో అత్యధిక గ్రామాలు ఉన్నాయి. ఐటిడిఏ పరిధిలో సబ్‌ప్లయిన్ గ్రామాలుగా గుర్తించబడినవి. 1. రంగాలగూడ 2. రావికోన 3. బట్టివల్స 4. కొత్తవల్స 5. లోవల్స 6. గంగమాంబపురం 7. అద్దూరివల్స 8. సీతంపేట 9. నడిమెగబవల్స 10. మడకవానివల్స. ఈ గ్రామాల గిరిజనుల భూములు గిరిజనులకే చెందాలని 1990-91లో సంఘం నాయకత్వాన పెద్దఎత్తున పోరాటాలు జరిగాయి ఆ సందర్భంగా భూ బదలాయింపు నిరోధించే 1/70 చట్టం అమలు చేయాలని, ఏఎల్‌టిఆర్ యాక్టు వర్తింపచేయాలని పెద్దఎత్తున గిరిజనులు డిమాండు చేసినా యింతవరకు గిరిజన గ్రామాలుగా గుర్తించడం లేదు. ఈ చట్టాలు అమలు చేయకపోవడంతో గిరిజనుల హక్కులకు నష్టము జరుగుచున్నది. వేరే రాష్ట్రాల నుండి వచ్చిన ఎస్టీఎం కంపెనీలాంటి సంస్థలు గిరిజన గ్రామాలలోని భూములను, అడవులను, కొండలను స్వాధీనం చేసుకుంటున్నారు. మరికొన్ని భూములు రిజర్వ్ ఫారెస్టు పేరుతో ప్రభుత్వ స్వాధీనంలో ఉంచుకొంటున్నారు. గిరిజనులకు సాగు చేసుకోడానికి భూములుల్లేక, కూలి దొరకక వలసలుపట్టే పరిస్థితి ఏర్పడింది. గిరిజన గ్రామాల మధ్యనున్న ఎస్టీఎం కంపెనీ భూములు గిరిజనులకే పంచిపెట్టాలని, వేలాది టేకుచెట్లు గిరిజనులకే చెందాలని, ఎస్టీఎం కంపెనీ యాజమాన్యానికి గాని, ఆ సంస్థ మేనేజర్లకుగాని టేకుచెట్లు కటింగ్ ఆర్డరు అనుమతులు యివ్వకూడదని డిమాండ్ చేస్తూ రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) ఆధ్వర్యంలో తహసిల్దారు కార్యాలయంవద్ద ధర్నా చేపట్టారు. ఈ ధర్నా కార్యక్రమంలో రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) విజయనగరం జిల్లా సహాయ కార్యదర్శి కా॥ ఎం. భాస్కరరావు, జిల్లా ఉపాధ్యక్షులు కా॥ బొత్స నరసింగరావు, జిల్లా కోశాధికారి కా॥ శ్రీనునాయుడు పాల్గొన్నారు. ధర్నా అనంతరం తహసిలుదారుకు డిమాండ్స్‌తో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.

D


ఎన్.వై.ఎస్. ప్రచురణలు
అప్పుల ఊబికి అందమైన పేరే
**మైక్రోఫైనాన్స్**
5/-

**తరతరాల విధ్వంసం**
భోపాల్‌లో నాడు జరిగిందేమిటి?
మళ్ళీ జరగవని గ్యారంటీ ఏమిటి?
5/-

**కాపీలకు:** మైత్రీ బుక్ హౌస్
జలీల్ వీధి, అరండల్‌పేట,
విజయవాడ

# సమష్టితత్వాన్ని, శ్రమసంస్కృతిని పెంపొందించే గ్రామీణ ఆటల పోటీలు



విజయవాడ సభలో ప్రసంగిస్తున్న కా॥ రవిబాబు



గుంటూరులో కబడ్డీ పోటీలు

**జనవరి 11,12, విజయవాడ :**

సంక్రాంతిని పురస్కరించుకొని స్థానిక న్యూ గిరిపురం కాలనీలో ఎన్‌వైఎస్, స్త్రీవిముక్తి సంఘటనల ఆధ్వర్యంలో లెమన్ అండ్ స్పూన్, స్లోసైక్లింగ్, ముగ్గులపోటీలు, మ్యూజికల్ ఛైర్స్, ఆటల పాటల పోటీలు జరిగాయి-బాల, బాలికలు, మహిళలు, వందమంది వరకు ఈ సంబరాలలో పాల్గొన్నారు.

11వ తేదీ ఉదయం రైతుకూలీసంఘం జిల్లా సహాయ కార్యదర్శి కా॥ వి. వీరబాబు వీటిని ప్రారంభించారు. పండుగలను ఆహ్లాదకరంగా జరుపు కోగలిగిన పరిస్థితి పేద, దిగువతరగతి ప్రజలకేకాక మధ్యతరగతి ప్రజానీకానికి కూడా కష్టభరితమైనదిగా మారిందన్నారు. 12వ తేదీ సాయంత్రం ఆటల, పాటలపోటీలలో పాల్గొన్నవారందరికీ బహుమతులు అందజేస్తూ స్థానిక తరిమెల నాగిరెడ్డి భవనం వద్ద బహిరంగసభ జరిపారు. ఈ సభలో ప్రజాసాహితి ప్రధానసంపాదకులు కా॥ కొత్తపల్లి రవిబాబు, స్వాతంత్ర్య సమరయోధులు వేములపల్లి వామనరావు, మానవీయ ఛారిటబుల్‌ట్రస్టు అధ్యక్షులు డా॥ శంకర్, ఓపిడిఆర్ నాయకులు కా॥ ఏసు, స్త్రీ విముక్తి సంఘటన నాయకులు కా॥ అరుణ పాల్గొని ప్రసంగించారు. వక్తలు సంక్రాంతి సందర్భంగా కాలనీ వాసులంతా సమష్టితత్వాన్ని పెంపొందించుకుంటూ, ఆటలు, పాటలతో శ్రామిక సంస్కృతిని పెంపొందించుకోవటాన్ని ఆహ్వానించారు. ఈ కార్యక్రమాలలో ఎన్‌వైయస్ నగర కన్వీనర్ కె. దుర్గారావు; నాయకులు వి. లక్ష్మణరావు, స్త్రీ విముక్తిసంఘటన నాయకులు పి. రాధిక తదితరులు పాల్గొని నిర్వహించారు.

**జనవరి 15,16, మంగళగిరి :**

భూస్వామ్య, సామ్రాజ్యవాద దోపిడీ విష సంస్కృతి టి.వి., సినిమా, క్రికెట్, మతం, కులం, మూఢనమ్మకాల వంటి వివిధ రూపాల్లో ప్రజలను పెడమార్గం పట్టిస్తూ, ప్రజల ఐక్యతను దెబ్బతీస్తున్న నేపథ్యంలో 'శ్రమజీవుల సంస్కృతిని, సమష్టితత్వాన్నీ చాటే గ్రామీణ క్రీడలను కాపాడుకుందాం' అనే నినాదంతో ఆటల పోటీలను ఎన్‌వైఎస్. పిడియస్‌ఓల ఆధ్వర్యంలో స్థానిక రతనాల చెరువు, లక్ష్మీనరసింహకాలనీలలో నిర్వహించారు.

15వ తేదీన రతనాల చెరువులో పోటీల అనంతరం సభ నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. 16తేదీన శ్రీలక్ష్మీనరసింహకాలనీలో పోటీల అనంతరం జరిగిన బహుమతి ప్రధాన సభలో నిర్మల జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ ప్రసాద్, చైతన్య భవన నిర్మాణకార్మిక సంఘం అధ్యక్షులు కాశిన కొండలరావు, న్యాయవాది వరలక్ష్మి పాల్గొన్నారు. వక్తలు తమఉపన్యాసాలలో టీవీ, సినిమాలు ప్రజలపై - ముఖ్యంగా యువతపై సాంస్కృతికంగా పడవేస్తున్న దుష్ఫలితాలను వివరించారు. ఈ కార్యక్రమాలలో పిడిఎస్‌ఓ జిల్లా అధ్యక్షులు యస్‌కె. బాజీసైదా, ఎన్‌వైఎస్ నాయకులు వి. దుర్గాప్రసాద్; పిడియస్‌ఓ, ఎన్‌వైయస్ నాయకులు పి. బాలాజి, పి. నాగరాజు, చందు, బాబ్జి తదితరులు పాల్గొని నిర్వహించారు.

**జనవరి 14,15, గుంటూరు :**

స్థానిక కొత్త కాలనీ మెయిన్‌రోడ్‌లో, లెమన్‌స్పూన్, స్లో సైక్లింగ్, స్కిప్పింగ్, మ్యూజికల్‌ఛైర్స్ ముగ్గుల పోటీలను పిడియస్‌ఓ, ఎన్‌వైఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థి యువకులు, మహిళలు ఈ పోటీలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. 14వ తేదీన ఆటల పోటీల అనంతరం జరిగిన సభలో విజేత పబ్లిక్ స్కూల్ డైరక్టర్ శ్రీహరి పాల్గొని బహుమతి ప్రదానం చేశారు.

15వ తేదీన స్థానిక కొండా వెంకటప్పయ్య కాలనీలో పై పోటీలతోపాటు అదనంగా కబడీ, వాలీబాల్ పోటీలను నిర్వహించారు. సాయంత్రం ఏర్పాటు చేసిన బహిరంగసభలో గురవయ్యకాలేజీ లెక్చరర్ ఎన్. అరవింద్ మాట్లాడుతూ విద్యార్థి యువతలో ప్రగతిశీల స్వభావాన్ని, న్యాయమైన ఆగ్రహాన్ని పెంపొందనీయకుండా పాలకులు కుట్రపూరితంగా వ్యవహరించటంలో భాగంగానే సాంస్కృతిక దాడి సాగిస్తున్నారని వివరించారు. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయ ప్రజా సంస్కృతి, కళలు, ఆటలు, పాటలు కోసం సంక్రాంతి వంటి



పిడుగురాళ్ళలో విజేతలకు బహుమతి ప్రధానం

సందర్భాలనుపయోగించటాన్ని కొనియాడారు. ఈ సభలలో ఇంకా రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) జిల్లా కార్యదర్శి కా॥ ఉల్లిగడ్డల నాగేశ్వరరావు, ఎన్‌వైఎస్ జిల్లా నాయకులు కా॥ కె. దేవా, పిడియస్‌ఓ నాయకులు కె.వి. రమణ, ఎన్‌వైఎస్ నాయకులు కా॥ మల్లి, బలరాంరెడ్డి, ప్రజాకళాకారులు కాట్రగడ్డ హనుమంతరావు పాల్గొని మాట్లాడారు. ప్రజాకళాకారులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

**జనవరి 14, 15, 16, పిడుగురాళ్ళ :**

సంక్రాంతిని పురస్కరించుకొని గ్రామీణ క్రీడలను, ప్రజాసంస్కృతిని తట్టి లేపే విధంగా ఎన్‌వైఎస్, పిడిఎస్‌ఓల ఆధ్వర్యంలో ఆటల పోటీలు జరిగాయి 14వ తేదీన లెనిన్‌నగర్‌లో కబడి, స్లోసైక్లింగ్, పరుగుపందెం, మ్యూజికల్ ఛైర్స్, స్కిప్పింగ్, లెమన్ స్పూన్, ముగ్గుల పోటీలు జరిగాయి. పోటీలకు న్యాయనిర్ణేతలుగా ఎంపిజెడ్‌పిహెచ్ స్కూలు పిడి గేరా ప్రభాకర్, ఎమ్ఎన్‌డిఓ నేలటూరి సుశింతరావు, రోజారాణి వ్యవహరించారు.

15వ తేదీన కా॥ విశ్వమోహనరెడ్డినగర్‌లో జరిగిన ఆటల పోటీలతో స్థానిక బాలలు, యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు కాలనీ అభివృద్ధి కమిటి నాయకులు బహుమతులు అందజేశారు.

16 తేదీన కా॥ తరిమెల నాగిరెడ్డినగర్‌లో అటల పోటీలలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం జరిగిన బహుమతి ప్రదాన సభలో విజేతలకు కాలనీ కమిటీ నాయకులు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వక్తలు తమ ఉపన్యాసాల్లో ప్రజాకళలను, గ్రామీణ క్రీడలను బతికించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు.

ఈ మూడురోజుల కార్యక్రమాలలో ఎన్‌వైఎస్ నాయకులు కా॥ శ్రీను, పిడిఎస్‌ఓ జిల్లాకార్యదర్శి కా॥ బి. నాగబసవయ్య, స్త్రీ విముక్తి సంఘటన నాయకులు కా॥ ఎం. నిర్మల, రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) నాయకులు కా॥ నీలాద్రి రాంబాబు స్థానిక యువజన కార్యకర్తలు, కాలనీల అభివృద్ధి కమిటీల నాయకులు ఉత్సాహంగా పాల్గొని నిర్వహించారు. D

**ప్రకటన** సిపిఐ (ఎం-ఎల్) (శ్రీకాకుళం) ఆర్గనైజింగ్ కమిటి జంఝావతి ఏరియా కార్యదర్శిగా పేర్కొంటున్న చిత్రూ అలియాస్ వెలగల అప్పలనాయుడును, మరో గిరిజన మహిళను ఒరిస్సాలోని బందుగాంబ్లాకు- కుమ్మగుంట పంచాయితీ, పెదమత్తురు అడవిలో 26-1-12న పోలీసులు చుట్టుముట్టి బంధించినట్లు, ఎన్‌కౌంటర్ పేరిట కాల్చిచంపినట్లుగా తెలియవస్తోంది. చిత్రూను, మరోగిరిజన మహిళను పోలీసులు కాల్చిచంపటాన్ని రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) తీవ్రంగా ఖండిస్తోంది.

**విజయవాడ**
**28-1-12**

**ఎస్. ఝాన్సి**
**కో-కన్వీనర్, ఏఐకెఎంకెఎస్**

# ఒడిషా వ్యవసాయరంగ సంక్షోభంపై పూరిలో సదస్సు

**మన** దేశంలో వ్యవసాయరంగం సంక్షోభంలో వున్నదనేది వివాదరహితమైన విషయం. అయితే ఈ సంక్షోభానికి ఏ విధానాలు కారణంగా వున్నాయి? ఎలాంటి చర్యలు లేదా మార్పులు తీసుకోవటంద్వారా వ్యవసాయాన్ని, దానిపై ఆధారపడిన ప్రజానీకాన్ని ఈ సంక్షోభాన్నుండి గట్టెక్కించగలం?- అనే ప్రశ్నలు వ్యవసాయరంగ సంక్షోభ బాధితులతో పాటుగా శ్రామిక రైతాంగపు శ్రేయోభిలాషులందరినీ కలచివేస్తున్న ప్రశ్నలుగా వున్నాయి. ఈ నేపథ్యంలో ఒడిషా-ఛాసీమూలియా సంఘ్(సిఎమ్ఎస్) ఆధ్వర్యంలో పూరి పట్టణంలో 2011 నవంబర్ 7న 'వ్యవసాయరంగ సంక్షోభం' అనే అంశంపై సదస్సు నిర్వహించారు.

నవంబర్ 7వ తేదీ మధ్యాహ్నం ఛాసీమూలియా, ఆదివాసీ ప్రజానీకం రాష్ట్రంలోని పూరి, కోరాపుట్, భద్రక్, కియోంఝర్, జగత్‌సింగ్‌పూర్ తదితర జిల్లాలనుండి 2500 మందికిపైగా ఈ సదస్సుకు హాజరయ్యారు. తొలుత గుండిఛా నుండి సదస్సు ప్రాంగణంవరకు పెద్ద ప్రదర్శన నిర్వహించారు. ఎర్రదుస్తులు ధరించి కోరాపుట్ నుండి హాజరైన ప్రజాకళాకారులు ప్రదర్శన పొడవునా విప్లవ గీతాలాలపించారు. డప్పుల నృత్యాలు, నినాదాలతో ప్రదర్శన ఉత్తేజకరంగా సాగింది. వీరంతా ఛాసీమూలియా సంఘ్ మరియు ఛాసీమూలియా ఆదివాసీ సంఘ్ బ్యానర్లను చేబూని, 'ఫ్యూడలిజం నశించాలి' 'సామ్రాజ్యవాదం నశించాలి' 'జగత్‌సింగ్‌పూర్, కళింగనగర్, నియంగిరి, కాశీపూర్ తదితర ప్రాంతాలలో బహుళజాతి కంపెనీలకు వ్యతిరేకంగా సాగుతున్న పోరాటాలకు మద్దతుగా నిలవాలి'. 'తమ హక్కుల పరిరక్షణకోసం, భూమికోసం పోరాడుతున్న కోరాపుట్ ఆదివాసీ ప్రజల పోరాటానికి మద్దతునివ్వండ'ంటూ ప్రదర్శనకారులు నినాదాలు చేశారు.

ఈ సదస్సులో ఏఐకెఎమ్‌కెఎస్ అఖిలభారత కన్వీనర్ కా॥సుబోధ్‌మిత్రా; పశ్చిమ ఒడిషా కృషక్ సమన్వయ్ సమితి నాయకులు సరోజ్; ఝార్సుగూడ కళాశాల విశ్రాంత అధ్యాపకులు ప్రొఫెసర్ గోలక్‌నాథ్; ఏఐకెఎమ్‌కెఎస్ అఖిలభారత కో-కన్వీనర్ కా॥ఎస్. ఝాన్సి; ఉత్కల్ యూనివర్సిటీ విశ్రాంత అధ్యాపకులు ప్రొఫెసర్ బీరేంద్ర నాయక్; పోస్కో ప్రతిరోధ్ సంగ్రామ్ సమితి నాయకులు బాబుతిరౌత్ తదితరులు ప్రసంగించారు. ఉపన్యాసకులందరూ మనదేశ ప్రజలు అనుభవిస్తున్న వ్యవసాయ సంక్షోభ తీవ్రతను, దానినుండి బయటపడే మార్గాలను వివరించారు. భూసంస్కరణల గురించి పాలకులు గప్పాలు కొట్టుకోవటం మినహా 'దున్నేవానికే భూమి' అనే నినాదం భూమిలేని నిరుపేదలకు ఈనాటికీ ఒక కలగానే మిగిలి వుంది. విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల వ్యాపారాల రూపంలో మనదేశంలో రైతాంగం బహుళజాతి పరిశ్రమల లూటీకి గురవుతున్నారు. వారు నిరంతరం వెన్నువిరిగే అప్పుల భారాలతో పీల్చిపిప్పి చేయబడుతున్నారు. వీనికి తోడుగా కరవులు, వరదలు, తుఫాన్లు వంటి వాటి ఫలితంగా సంభవించే వినాశనానికి రైతాంగం పదేపదే నిస్సహాయంగా వదలివేయబడుతున్నారు. గత రెండు దశాబ్దాలుగా మనదేశంలో పాలకులు తీవ్రంచేస్తున్న సరళీకరణ, ప్రైవేటీకరణ, గ్లోబలీకరణల ఫలితంగా సామ్రాజ్యవాద దోపిడీ మరింత పెరిగింది. దీనితోపాటుగా మనదేశంలోని గ్రామీణ ప్రాంతాలలోకి సామ్రాజ్యవాదులు చొచ్చుకొని పోవటంద్వారా మన ప్రజల జీవనాన్ని, ఆర్థికవ్యవస్థను నాశనం చేస్తున్నారు. రైతులు, ఆదివాసులు నిరంతరాయంగా తమ భూములనుండి గెంటివేయ బడుతూ వస్తున్నారు. అభివృద్ధిపేరుతో సాగుతున్న ఈ చర్యల ఫలితంగా-గ్రామీణ ప్రాంతాల నుండి తరిమి వేయబడుతున్న వీరంతా పొట్టచేత బట్టుకొని ఇతర ప్రాంతాలకు వలసపోయేందుకు నెట్టబడుతున్నారు. కానీ, వాస్తవానికి పేదలనుండి బలవంతంగా గుంజుకొన్న ఈ భూములను సామ్రాజ్యవాద కంపెనీలకు, వారి అదుపాజ్ఞలలోని బడా దళారీ కంపెనీలకు కట్టబెడుతూ మనదేశ మానవ వనరులను, సహజసంపదలను విచ్చలవిడిగా దోపిడీచేసుకునేందుకు వారికి పాలకులు పెద్దఎత్తున అవకాశాలు కల్పిస్తున్నారు. ఈ దోపిడీ విధానాల అమలుకు పంటభూమిగా ఎంచుకొని మరీ పాలకులు ఒడిషా రాష్ట్రంలో ఈ విధానాలు అమలు చేస్తున్నారు. పాలకవర్గాల భూస్వామ్య, సామ్రాజ్యవాద అనుకూల విధానాలే ప్రస్తుత సంక్షోభానికి మూల కారణంగా ఏఐకెఎమ్‌కెఎస్ నాయకులు పేర్కొన్నారు. వ్యవసాయరంగాన్ని సంక్షోభంనుండి గట్టెక్కించాలంటే, అభివృద్ధికి సంబంధించిన సరైన దిశగా వ్యవసాయం సాగాలంటే భూసంబంధాలలో మౌలికమైన, ప్రజాస్వామికమైన సంస్కరణల కోసం వ్యవసాయ రంగంలో సామ్రాజ్యవాదుల నియంత్రణకు చరమగీతం పాడటమే పరిష్కారమన్నారు. కావున, ఛాసీమూలియా, ఆదివాసీ ప్రజలు సంఘటితమై శక్తివంతమైన దేశవ్యాపిత ఉద్యమంగా అభివృద్ధి చేయవలసిన ఆవశ్యకతను నొక్కిచెప్పారు. ఒడిషా-ఛాసీమూలియా సంఘ్‌నుండి కా॥బసు సదస్సును ముగించారు.

2011 నవంబర్ 8వ తేదీన ఛాసీమూలియా సంఘ్ కార్యకర్తలతో రాష్ట్రస్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పూరి, కోరాపుట్, భద్రక్, కియోంఝర్, జగత్‌సింగ్‌పూర్ తదితర జిల్లాలనుండి కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఏఐకెఎమ్‌కెఎస్ కో-కన్వీనర్ కామ్రేడ్ ఎస్.ఝాన్సి ఏఐకెఎమ్‌కెఎస్ ఆశయాలు-లక్ష్యాలను వివరించారు. వ్యవసాయ విప్లవ దృక్పథం వెలుగులో ఒడిషాలోని ఛాసీమూలియా మరియు ఆదివాసులను సంఘటితంచేసి ముందుకు నడిపించాలని ఆమె కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఏఐకెఎమ్‌కెఎస్ కన్వీనర్ కా॥సుబోధ్‌మిత్రా ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిషా, బెంగాలు, ఝార్ఖండ్, బీహార్, యు.పి., ఎమ్.పి., పంజాబ్, తమిళనాడు, కేరళ తదితర రాష్ట్రాలలోని రైతుల, వ్యవసాయ కూలీల, గ్రామీణ పేదల సంఘాలను ఐక్యం చేయటానికి అఖిల భారత స్థాయిలో ఏఐకెఎమ్‌కెఎస్‌గా నిర్మాణం చేసేందుకు సాగుతున్న కృషిని వివరించారు.

2011 డిసెంబర్ 18, 19 తేదీలలో విశాఖపట్నంలో నిర్వహించనున్న కార్మిక, రైతు-కూలీ సమ్మేళనాన్ని, ఏఐకెఎమ్‌కెఎస్ అఖిలభారత సదస్సును గురించి ఆయన వివరించారు.

ఈ సమావేశం కా॥ శ్రీకాంత్ మొహంతి కార్యదర్శిగా ఛాసీమూలియా సంఘ్ ఒడిషా- ఆర్గనైజింగ్ కమిటీని ఎన్నుకున్నది. ఉత్తేజకరంగా ముగిసిన ఈ సమావేశంలో ఛాసీమూలియా సంఘ్ (సిఎమ్ఎస్) కార్యక్రమాలను ఏఐకెఎమ్‌కెఎస్ అనుబంధంగా కొనసాగించేందుకు ఆమోదం తెల్పుతూ తీర్మానించారు. D

**రాజకీయ దృక్పథం...** (5వ పేజీ తరువాయి)

చేసుకోలేక పోయారు. పారిశ్రామిక యజమానులు, కార్మికులు పరస్పరం వ్యతిరేక వర్గానికి చెందిన వారనీ, వారి ప్రయోజనాలు పరస్పర విరుద్ధమైనవనీ వారికి తోచలేదు.దోపిడీ వర్గానికి వారి రాజకీయాలు వారికి ఉంటాయని, అదేవిధంగా పీడిత వర్గానికి ప్రత్యేక రాజకీయాలు ఉంటాయని వారు అర్థం చేసుకోలేక పోయారు. వర్గదృక్పథం లేకపోవడం చేతనే సోనూగుజ్జల్ కార్మిక సంఘ నాయకత్వాన్ని వదులుకున్నాడు. అది ఒక త్యాగంగా అతను భావించాడు. కాంట్రాక్టు కార్మికులనందరినీ క్రమబద్ధం చేయాలనే, పనిభారం తగ్గించాలనే డిమాండ్లతో కార్మిక సంఘాన్ని ఏర్పాటు చేసినప్పటికీ, క్రమంగా ఆ సంఘం దాని లక్ష్యం నుంచి దూరమయింది. తొలగించిన కార్మికులను పునర్నియమించటానికి దాని డిమాండు పరిమిత మయింది. వారి పోరాటం యొక్క ప్రధాన లక్ష్యం సాధించబడలేదు. సోనుగుజ్జల్‌కు వర్గదృక్పథం, వర్గచైతన్యము ఉన్నట్లయితే కుటుంబ సభ్యులను, పరిసర గ్రామాల ప్రజలను తమ సమ్మెకు మద్దతుగా మలుచుకోగలిగేవాడు. తొలగింపబడిన కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతారనటంలో అనుమానం లేదు. నాయకత్వం వర్గ రాజకీయాలలో ఉన్నప్పుడు ఈ కష్టాలు మరింత ఎక్కువవుతాయి.

తమ పోరాటానికి దేశ వ్యాప్తంగా కార్మిక వర్గాన్నుంచి వచ్చిన మద్దతు, సంఘీభావాల యొక్క ప్రాముఖ్యతను కూడా సోనుగుజ్జల్ అర్థంచేసుకోలేదు. వర్గ చైతన్యం లేకపోవటం వలననే ఇది జరిగింది. అందువలననే కర్మాగారాన్ని మానెసర్ నుంచి మరో చోటికి మారుస్తారని అతను భయపడ్డాడు. పెట్టుబడి దారులు తమ లాభాల కోసం కార్మికులను ఎక్కువగా దోచుకునే చోటికి మారుస్తూనే ఉంటారన్న విషయం అతనికి తెలియదు.

నీతి, నిజాయితీలు నాయకత్వానికి ఉండవలసిందే. కానీ కార్మిక నాయకత్వానికి ఉండవలసిన ముఖ్యలక్షణం కార్మికవర్గ రాజకీయాలను అర్థం చేసుకుని, కార్మిక ఉద్యమాన్ని నడపగల నైపుణ్యం ఉండటమే. కార్మికవర్గ చైతన్యంతో, వర్గప్రాతిపదికన సంఘటిత పడనిదే, పాలక ప్రభుత్వాల, బడా పెట్టుబడి దారుల దాడులను ఎదుర్కోలేరు.

మానెసర్‌ప్లాంట్ కార్మికుల పోరాటాన్ని వర్గ రాజకీయాల ప్రాతిపదికన నడపకపోవటం వలననే నాయకత్వాన్ని వదులుకునే పరిస్థితి వచ్చింది.

కొత్తగా ఏర్పడిన సంఘంలోని 11 మంది కమిటీ సభ్యులు తమ ఉద్యోగాలకు రాజీనామా చేసి యాజమాన్యం ఇచ్చింది తీసుకుని వెళ్ళిపోయారు.

మారుతి-సుజుకి కార్మికులను మొదట అది దిగ్భ్రాంతికి గురిచేసినా వారు తేరుకుని, తరువాత కొత్త కమిటీని ఎన్నుకొని, వారి ప్రయోజనాల పరిరక్షణ కొరకు ధైర్యంగా నడుపుతున్నారు. ఇది ఒక సానుకూల అంశం. వారి ఈ ప్రయత్నం వర్గ చైతన్యంతో కూడినదై ఉంటే వారి భవిష్యత్ పోరాటాలు విఫలం కావు.

ఈ విధంగా **కార్మిక ఉద్యమాలు, కార్మికవర్గ రాజకీయాల ప్రాతిపదికన వర్గదృక్పథంతో నడపబడకుంటే అవి పెట్టిబడిదారీ వర్గాన్ని ఎదుర్కొని విజయం సాధించలేవనేది** మానెసర్ ప్లాంట్ కార్మికుల అనుభవం తెలుపుతోంది. D

# కా॥ పింజల వెంకట సుబ్బారావుకు ఘన నివాళులు




సంస్మరణ సభలో ప్రసంగిస్తున్న కా॥ భార్గవశ్రీ; సభకు హాజరైన ప్రజలు

**వేటపాలెం, 6-1-12 :**

సీనియర్ కమ్యూనిస్టు, సిపిఐ(ఎం-ఎల్) ప్రకాశం జిల్లా నాయకులు కా॥ పింజల వెంకట సుబ్బారావు జనవరి 5వ తేదీన అనారోగ్యంతో మరణించారు. ఆయన మరణవార్త తెలిసిన వెంటనే చీరాల, వేటపాలెం మండలంలోని చేనేత కార్మికులు, వివిధ సంఘాల నాయకులు, ప్రకాశం జిల్లా నలుమూలలనుంచి వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

సిపిఐ (ఎం-ఎల్) రాష్ట్ర నాయకులు కా॥ జి. విజయకుమార్, ఏఐఎఫ్‌టియు (న్యూ) రాష్ట్ర నాయకులు కా॥ డివిఎన్ స్వామి, కా॥ జగ్గారపు సుబ్బారావు; రైతుకూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కా॥ జె. కిషోర్‌బాబు; జిల్లా కార్యదర్శి కా॥ ఎస్. లలితకుమారి; ప్రజాతంత్ర చేనేత కార్మిక సంఘం రాష్ట్రకన్వీనర్ కా॥ వై. సోని, సిపిఐ నాయకులు కా॥ ఎన్. చంద్రారెడ్డి, సిపిఎం నాయకులు పి. కొండయ్య, రాష్ట్ర చేనేత జన సమాఖ్య నాయకులు మాచర్ల మోహనరావు, గొఱ్ఱె నాగలింగం, మాజీ ఎంపిపి గుద్దంటి రాజేంద్రప్రసాద్, ఈ ప్రాంతంలోని పలుచేనేత సొసైటీల అధ్యక్షులు- మాచర్ల గౌరీశంకర్, కాటూరి వెంకటేశ్వర్లు, సదానందరావు, సీనియర్ చేనేత నాయకులు కూర్మానాగభూషణం తదితరులు, ప్రముఖులు, మేధావులు నివాళులర్పించారు.

## అంతిమయాత్ర

6-1-2012న కా॥సుబ్బారావు అంతిమయాత్ర ఆయన ఇంటివద్ద నుండి బయలుదేరింది. పెద్దఎత్తున నినాదాలతో, చుట్టుప్రక్కల గ్రామాలనుండి చేనేత కార్మికులు, ప్రముఖులు అంతిమయాత్రలో పాల్గొన్నారు. వేటపాలెం గ్రామ వీధులలో 3 గం॥పాటు అంతిమయాత్ర సాగింది. ఆయన శిష్యులైన కోలాటం, కర్రసాము కళాకారుల బృందాలు అంతిమయాత్రలో తమ కళారూపాలు ప్రదర్శిస్తూ ఘనంగా నివాళులు అర్పించారు. కా॥ సుబ్బారావును ప్రజలు కడసారి చూసేందుకు తమ ఇళ్ళముందు బారులుతీరి సంతాపాన్ని వ్యక్తం చేశారు.

## సంస్మరణసభ

**వేటపాలెం, 19-1-12 :**

ప్రజాతంత్ర చేనేత కార్మిక సంఘ రాష్ట్ర గౌరవాధ్యక్షులు, వేటపాలెం చేనేత సొసైటీ ప్రెసిడెంట్ కా॥ పింజల వెంకట సుబ్బారావు సంస్మరణ సభను 19-1-2012 సా॥ 4 గంటలకు వేటపాలెం చేనేత సొసైటీ కార్యవర్గం, వేటపాలెం ప్రజాతంత్ర చేనేత కార్మిక సంఘం కమిటీలు సంయుక్తంగా నిర్వహించాయి.

ఈ సభకు వేటపాలెం చేనేత సొసైటీ ప్రెసిడెంట్ వలుకుల యానాదిరావు, సలహాదారు దేవన సాంబశివరావు, ప్రజాతంత్ర చేనేత కార్మిక సంఘ నాయకులు కా॥ వార్తి కోట సుబ్బారావులు అధ్యక్షవర్గంగా సభను నిర్వహించారు. ఈ సభలో సిపిఐ (ఎం-ఎల్) రాష్ట్ర నాయకులు కా॥ ముప్పాళ్ళ భార్గవశ్రీ మాట్లాడుతూ అలనాటి మహత్తర తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పటేల్ సైన్యంతో రక్తపాతంతో పాశవికంగా అణచివేసి ప్రజలను భీతావహులను చేసి నిర్బంధాన్ని రుద్దుతున్న సమయంలోనే 14 ఏళ్ళ చిన్న పిల్లవాడుగా ఉన్న కా॥ సుబ్బారావు, ఈ ప్రాంతంలో పనిచేసిన కా॥ కస్తూరి కుటుంబరావు, సూర్యబాలానందం, వెంకటేశ్వర్లుల సాన్నిహిత్యంతో స్ఫూర్తిపొంది ఎంతో ధైర్యంగా కష్టతరమైన ఈ బాటనే, పీడిత ప్రజల విముక్తినే తనలక్ష్యంగా ఎంచుకున్నారనీ, అనంతర కాలంలో ఆ ముగ్గురు కామ్రేడ్లను పాలకులు నిర్బంధించి కాల్చిచంపినా వెరువక కా॥ సుబ్బారావు ఆ బాటలోనే ఈనాటి వరకూ సాగారన్నారు. ఎమర్జెన్సీ చీకటిరోజులలో పార్టీని కంటికి రెప్పలా కాచుకున్నారనీ, పార్టీ కార్యకర్తలను కడుపులో పెట్టుకుని కాపాడుకున్నారనీ, కమ్యూనిస్టు పార్టీలో వచ్చిన పరిణామాలన్నింటినీ అతి,మిత వాద అవకాశ వాదాలకు, పెడధోరణులకు వ్యతిరేకంగా ప్రజా యుద్ధపంథా పట్ల స్పష్టతతో అమరులు కా॥ టి.ఎన్. చూపిన బాటలో సాగుతూ కా॥ కానూసన్యాల్ నాయకత్వంలో ఏర్పడిన సిపిఐ (ఎం-ఎల్)లో కడదాకా కొనసాగారనీ, నిరంతరం ప్రజలలో ఉంటూ వారి సమస్యలకోసం నిలబడ్డారనీ, ఆయన సంస్మరణ సభకు హాజరైన ప్రజాస్పందనే దానికద్దం పడ్తున్నదన్నారు.

ఏఐఎఫ్‌టియు(న్యూ) రాష్ట్ర నాయకులు కా॥ డి.వి.ఎన్. స్వామి మాట్లాడుతూ, వేటపాలెం ప్రాంతంలోని వివిధ సామాజిక వర్గాలు, వృత్తులకు సంబంధించిన ప్రజలపై కా॥ సుబ్బారావు తనదైన ప్రభావాన్ని వేశారని; రైతుకూలీల, బీడీకార్మికుల, కేపాల్ కార్మికుల, అగర్బత్తీ కార్మికుల సమస్యలపై పోరాడారని; ప్రత్యేకించి ఈ ప్రాంతంలో కేంద్రీకృతమైన చేనేత కార్మికుల సమస్యలపై, వృత్తి రక్షణకై, కార్మికుల జీవితాల మెరుగుదలకై బలమైన ఉద్యమాన్ని నిర్మించారని, మిలిటెంట్ ఆందోళనలు నిర్వహించారని, ప్రభుత్వం రూపొందిస్తున్న చేనేత వ్యతిరేక, జౌళి విధానాలకు వ్యతిరేకంగా, మజూరీల(కూలీ) సమస్యలపై ఐక్యకార్యచరణ ఏర్పాటు చేయటంలోనూ క్రియాశీలక పాత్ర నిర్వహించారన్నారు. వాన్‌పిక్-కోస్టల్ కారిడార్ వ్యతిరేక పోరాటంలో 80 ఏళ్ళ వయసులో కూడా గ్రామగ్రామాన తిరిగి ప్రజలను చైతన్య పరిచారని, వాన్‌పిక్ కార్యాలయ ముట్టడిలో అరెస్టై నిర్బంధం ఎదుర్కొన్నారని గుర్తుచేశారు.

ప్రజాతంత్ర చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కన్వీనర్ కా॥ సోని మాట్లాడుతూ 40 ఏళ్ళ క్రితమే ప్రజాతంత్ర చేనేత కార్మిక సంఘ నిర్మాణ సన్నాహక కృషి చేశారని, వృత్తిరక్షణ కోసం నిలబడి, కార్మికులను చైతన్యపరిచి ఈ ప్రాంతంలో ఏర్పాటు చేయతలపెట్టిన పవర్‌లూమ్‌లకు వ్యతిరేకంగా మిలిటెంట్ పోరాటాలు నడిపి తరిమికొట్టారని, చేనేత సత్యాగ్రహంలో పాల్గొని అరెస్టయ్యారని, ఇటీవలి కాలంలో నూతన జౌళి విధానం, సత్యం కమిటీ సిఫారసుల రూపంలో ప్రభుత్వం మరణ శాసనం లిఖించిందని, దీనిని గుర్తించి ఉద్యమం సాగించటంతోపాటు, రాష్ట్రస్థాయిలో ప్రజాతంత్ర చేనేత కార్మిక సంఘాన్ని పునర్నిర్మించే కృషిలో, రాష్ట్ర వ్యాప్తంగా చేనేత పరిశ్రమలో వివిధ ప్రాంతాల మధ్య పరిస్థితులను అధ్యయనం, మదింపు చేయటంలో వృద్ధాప్యంతో ఉండికూడా, క్రియాశీలక పాత్ర నిర్వహించారన్నారు.

సిపిఐ (ఎం-ఎల్) జిల్లా నాయకులు కా॥లలితకుమారి మాట్లాడుతూ కా॥ సుబ్బారావు వర్గ స్పృహతో కార్మికులు, రైతుకూలీలు, పీడిత, దళిత మహిళా సమస్యలపై ఆందోళనా పోరాటాలు నిర్వహించటంతో పాటు వారికి అడుగడుగునా అండదండగా నిలిచారన్నారు. ప్రకృతి వైపరీత్యాల బారిన పడి నిరాశ్రయులైన దివిసీమ, కందుకూరు, రేపల్లె తాలూకాల ప్రజలను వివిధ రూపాలలో ఆదుకోవటంలో కృషిని సాగించారని, కళాకారుడుగా ఉంటూ యువతను కూడగట్టడం కోసం కోలాటం, కర్రసాము, పాటలు, నృత్యాలు, నాటికలు, నాటకాలు వంటి అనేక కళారూపాలనుపయోగించి, యువజన సంఘ నిర్మాణం చేపట్టారని; ఆ కృషి కడదాకా కొనసాగించారన్నారు. శ్రమపట్ల Z

Z మక్కువతో కుటుంబ సభ్యులందరికీ విలువలతో కూడిన శ్రమజీవనాన్ని అందించారనీ, క్రియాశీల రాజకీయాల్లో ముందుంటూ తన రెక్కల కష్టంతో కుటుంబాన్ని పోషించారన్నారు.

కనిగిరి చేనేత సొసైటీ ప్రెసిడెంట్ కా॥ పల్లా రామచంద్రరావు మాట్లాడుతూ 33 ఏళ్ళపాటు వేటపాలెం సొసైటీకి ప్రెసిడెంట్‌గా వుంటూ ఏనాడూ తనకోసం ఒక్కరూపాయి ఆశించలేదని, ఆప్కోడైరెక్టరు ఎన్నికలలో ఓట్లకు చందాలిచ్చిన అనేక సందర్భాలలో ఒక్క చిల్లిగవ్వ కూడా ఆశించకుండా అదే విలువలను తన బిడ్డలకు అందించారని, ఆ విలువలు కమ్యూనిస్టు పార్టీవారసత్వమేనని అన్నారు. సహకార సంఘ సమస్యల కోసం తాను ముందుండి తమని నడిపించి సమస్యల పరిష్కారం కోసం పోరాడేవారని అన్నారు.

సభలో సిపిఐ (ఎం-ఎల్) రాష్ట్ర నాయకులు కా॥ విజయకుమార్, అఖిలభారత రైతుకూలీసంఘం జిల్లా కార్యదర్శి కె. నరసింహం, కా॥ గొఱ్ఱె నాగలింగేశ్వరరావు, రాష్ట్ర చేనేత జనసమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు; ఏఐటియుసి నాయకులు కా॥ బాబూరావు; ఏఐవైఎఫ్ నాయకులు ఎన్. నాగార్జునరెడ్డి; చేనేత కార్మిక మిత్రమండలి కన్వీనర్ ఆకురాతి మధు; చేనేత నాయకులు ఆకురాతి రత్నారావు; మోటుపల్లి పోర్ట్ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు పంద్రాజు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సభలో అమరవీరుల పోరాటాల, త్యాగాల వారసత్వాన్ని ఎత్తిపట్టిన ప్రజాకళారూపాలు, నృత్యాలు, నెత్తుటిదీపాలు నృత్యరూపకం సభకు హాజరైన ప్రజానీకానికి స్ఫూర్తినందించాయి. ప్రజాకళాకారులు 'జనవిజయం' నాటిక ప్రదర్శించుట ద్వారా కా॥ సుబ్బారావుకు ఘనమైన నివాళినర్పించారు. D

# రీజన్సీ ఘటనపై యానాం పర్యటించిన వామపక్ష పార్టీలు

**27-1-12న** యానం రీజన్సీ కార్మికులు చేస్తున్న ఆందోళనపై యాజమాన్యం, పోలీసులు జరిపిన దాడులు, కాల్పుల ఘటన-కాల్పుల్లో కార్మిక నాయకుడు యూనియన్ అధ్యక్షుడు మచ్చా సోమేశ్వర మురళీ మోహన్ మృతిచెందిన విషయమై పరిశీలించడానికి వామపక్ష పార్టీల నాయకులు ఆ ప్రాంతంలో పర్యటించారు. ఇందులో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులుకా॥జెల్లివిల్సన్(ఎమ్మెల్సి); సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కా॥ సిహెచ్. నర్సింగరావు, జిల్లా సెక్రటరీ కా॥దడాల సుబ్బారావు,సిపిఐ(ఎం-ఎల్)జిల్లా నాయకులు కా॥ వి. సుబ్బారావు; రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కా॥ ఎమ్.ఎస్. నాగరాజు; సిపిఐ (ఎం-ఎల్ న్యూడెమోక్రసీ) రాష్ట్రకమిటి సభ్యులు కా॥కె. రమ; సిపిఐ (ఎం-ఎల్- లిబరేషన్) రాష్ట్రకమిటి సభ్యులు కా॥ జి. సత్యనారాయణ; ఎం.సి.పి.ఐ.(యు) రాష్ట్రకమిటి సభ్యులు కా॥యం.వి.ఎన్. పట్నాయక్, కె.వి.రెడ్డి; తదితరులు పాల్గొన్నారు.

కాల్పుల్లో మరణించిన మురళీమోహన్ మృతదేహాన్ని టి.కొత్తపల్లిలో సందర్శించిన బృందం అక్కడఉన్న కార్మికులు, ప్రజల్ని ఉద్దేశించి మాట్లాడారు. కార్మికుల ప్రాథమిక హక్కుల్ని హరించి వేస్తున్న యాజమాన్యాలను, ప్రభుత్వ విధానాలను విమర్శించారు. చనిపోయిన మురళీమోహన్ త్యాగాన్ని కార్మికవర్గం, పీడిత ప్రజల పక్షాన నిలిచేవారు మరిచిపోరని, ఈ సంఘటన చరిత్రలో నిలిచి పోతుందన్నారు. అతని కుటుంబానికి, కార్మికులకు ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలియజేసారు. మృతుని కుటుంబానికి, క్షతగాత్రులకు నష్టపరిహారం కోసం, కార్మికుల హక్కుల రక్షణకోసం అందరం కలసి పోరాడాలని, అందుకై వామపక్ష పార్టీలు బాధ్యత తీసుకొంటాయని చెప్పారు.

అనంతరం యానాం కార్మికులను కలసి సంఘటనపై చర్చించారు. ఘటనకు బాధ్యులైన సిఐ, ఎస్‌ఐలను సస్పెండ్ చేసి, కేసులు నమోదు చెయ్యాలని; హైకోర్టు సిట్టింగ్ జడ్జిచే న్యాయవిచారణ జరపాలని; కార్మికులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని, మృతి చెందిన మురళీమోహన్ కుటుంబానికి రు.25 లక్షల నష్టపరిహారం, కుటుంబానికి ఉద్యోగం ఇవ్వాలని; గాయపడినవారికి ఒక్కొక్కరికి ఐదులక్షలు ఇవ్వాలని, యాజమాన్యంపై ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్ట ప్రకారం కేసు నమోదు చెయ్యాలని, తక్షణమే కంపెనీని తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించాలని, అందుకై ప్రభుత్వమే బాధ్యత తీసుకోవాలని; కార్మికుడి మృతికి గుండెపోటు కారణం అనే సాకులు అపివేసి మానవ హక్కుల సంఘం సూచనల మేరకు కేసును కొనసాగించాలని డిమాండ్ చేశారు. అన్నింటిపై తాను ప్రభుత్వానికి సిఫార్సులు చేస్తానని; కంపెనీ విషయంలో చర్యలు తీసుకుంటానని కలక్టర్ చెప్పారు.

తర్వాత కాకినాడలోని క్షతగాత్రులను పరామర్శించి అనంతరం విలేకరులతో మాట్లాడుతూ 25 ఏళ్ళుగా కనీస వేతనం ఇవ్వకపోగా, సంఘం పెట్టుకొనే హక్కును కాలరాయాలన్న యాజమాన్య నిరంకుశ విధానాలు, వారితో కుమ్మక్కయిన పోలీసుల కుట్రల ఫలితమే సంఘటన జరిగిందని అందుకు ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించి, కార్మికుల హక్కులకై చర్యలు తీసుకోవాలన్నారు. D

# రీజన్సీ కార్మికులపై పోలీసుల దాడులు యూనియన్ నాయకుని హత్య-నిరసన కార్యక్రమం



బందరులో ధర్నా

**మచిలీపట్నం, 29-1-12 :**

**పుదుచ్చేరి** రాష్ట్రం యానాం రీజెన్సీ కార్మికులపై పోలీసుల మూకుమ్మడి దాడి, పోలీసుల దెబ్బలకు యూనియన్ నాయకుడు మురళీమోహన్ మృతి నేపథ్యంలో పోలీసుల కాల్పులకు నిరసనగా, యానాం కార్మికుల ఆందోళనకు సంఘీభావం తెల్పుతూ ఏఐఎఫ్‌టియు (న్యూ) బందరు ఏరియాశాఖ ఆధ్వర్యంలో స్థానిక జడ్‌పి సెంటర్‌లో సా॥ 4 గంటలకు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎఫ్‌టియు (న్యూ) రాష్ట్ర కార్యదర్శి కా॥ యద్దనపూడి సోని ప్రసంగిస్తూ యానాం కార్మికులు సంఘటిత పడటం సహించలేని యాజమాన్యం ఆందోళన చేస్తున్న కార్మికులపై పోలీసులచే చేయించిన పాశవిక దాడిని ఖండించారు. ఉద్యమిస్తున్న కార్మికులపై పోలీసులు దాడి చేయడం ఇదేమీ కొత్తకాదనీ, గుర్‌గావ్‌లో హోండా కార్మికులపై జరిగిన పాశవిక దాడి, కార్మికులను వెంటాడి, వేటాడి మేడమీద నుంచి తోసేసిన చరిత్ర మనముందున్న దన్నారు. తమ హక్కుల సాధన కోసం, మనుగడకోసం ఉద్యమిస్తున్న కార్మికులపై తీవ్రనిర్బంధం, అణచివేతలతో కోపోద్రిక్తులైన కార్మికులు తిరగబడిన తీరు, పెట్టుబడి దారులకు ఒక హెచ్చరిక అన్నారు. అణచిపెట్టేకొద్ది కార్మికవర్గం తిరగబడి ఏవిధంగా ఏ పరిణామాలకు దారి తీస్తుందో ఇందుకు యానాం ఘటనే తార్కాణమన్నారు. ఏఐఎఫ్‌టియు(న్యూ) నాయకులు కా॥ బెల్లంకొండ రవి, ధర్నాలో సంఘీభావం తెల్పిన రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) జిల్లా నాయకులు పామర్తి అంజమ్మ, ఈపూరి రాంబాబు, కొప్పినేని ఉమామహేశ్వరరావు, జె. జగన్ యాజమాన్యం చేయించిన పాశవిక దాడిని ఖండిస్తూ మాట్లాడారు. చిలకలపూడి సిడబ్ల్యుసి యూనియన్, టుటౌన్ ముఠా కార్మికుల యూనియన్, అభ్యుదయ రైస్‌మిల్ వర్కర్స్ యూనియన్‌ల నుండి కార్మికులు 100 మందిపైగా ఈ ధర్నాలో పాల్గొన్నారు. ఏఐఎఫ్‌టియు (న్యూ) అధ్యక్షుడు కా॥ ముచ్చు సుధాకరరావు, యూనియన్ల నాయకులు కా॥ బంద్రెడ్డి సుబ్రహ్మణ్యం, సుంకర సూర్యనారాయణ, కాగిత నాగేశ్వరరావు, గాంధి, పరసా శ్రీనివాసరావు పాల్గొన్నారు. D

Printed, Published and Owned by P. Jaswantha Rao 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010
and Printed at Chaitanya Printers, Gora Veedhi, Suryaraopet Vijayawada-2
Editor: P. Jaswantha Rao, 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010